
దేశరాజధాని ఢిల్లీలో ఈరోజు బంగారం ధర
తులం బంగారం (10 గ్రాములు)
1,45,050/- (22 క్యారెట్స్)
1,58,240/- (24 క్యారెట్స్)



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 44 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 31-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

రైతు ఒక శ్రమజీవి
రైతు ను బెల్ట్ షాప్ ల నుండి
దూరంచేద్దాం,
రైతు ఆరోగ్యాన్ని కాపాడుదాం,
రైతును ఆరోగ్యకర పంటలు
పండించేటట్లు ప్రోత్సహిందాం,
రైతుల్లో సహకార భావం నిర్మిద్దాం,
రైతుల్లో ఐఖ్యత భావం పెంచుదాం,
రైతును ఓటు బ్యాంకు గా చూసే
రాజకీయ పార్టీలను తరిమెద్దాం,
రైతు కోసం సమగ్ర
పంట భీమా విధానం తయారు చేద్దాం,
రైతును మోసం చేసే దళారిని తెరిమెద్దాం,
రైతు గౌరవం పెంచుదాం,
భారతీయ జీవన విధానానికి
రైతే వెన్నుముక అని నిరూపిద్దాం.

– తిరుపతి రెడ్డి పట్లోల్ల..,



# వాన రాక.. నీరు లేక..
# రైతన్నకు కన్నీళ్లే!

- బోర్ల కోసం అప్పులు
- ఎరువుల కోసం క్యూలు
- పంటలకు గిట్టుబాటు ధర కరువు
- బోర్ల కింద నాట్లు వేసినా ఎండుతున్న పంటలు
- ఎరువుల కోసం రైతు పడిగాపులు
- వరి, బత్తాయి నుంచి పత్తి వరకు అన్న దాతకు అడుగడుగునా సంక్షోభమే



**ప్రజా వాయిస్ డెస్క్, హైదరాబాద్.** తెలంగాణ రైతన్నకు ఈ వానాకాలం పంటకాలం కంటే పరీక్షాకాలంగానే మారుతోంది. ఒకవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు లేక పంటలు ఎండుముఖం పడుతుండగా.. మరోవైపు కష్టపడి అప్పులు చేసి బోర్లు వేసినా నీరు పడక రైతులు నష్టాల పాలవుతున్నారు. బోర్లు పడిన చోట కూడా నీటి లభ్యత సరిపోక నాట్లు వేసిన వరి పొలాలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. దీనికి తోడు ఎరువుల కొరత, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, కూలీల భారం, పురుగుమందుల ధరలు, మార్కెట్‌లో గిట్టుబాటు ధరపై అనిశ్చితి అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

**ఆకాశం వైపు ఆశగా..**

సకాలంలో వర్షాలు కురవక వర్షాధార పంటలు తేమ కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే పంటలు వేసిన రైతులు నీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. వర్షం కోసం ఎదురు చూడటం తప్ప రైతుకు మరో మార్గం కనిపించని పరిస్థితి అనేక ప్రాంతాల్లో నెలకొంది.

**బోరు వేస్తే అప్పు.. పడకపోతే నష్టం**

పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేస్తున్న రైతులకు నీరు పడకపోవడం తీవ్ర నష్టాన్ని మిగులుస్తోంది. వేలాది రూపాయలు ఖర్చు చేసినా బోరు విఫలమైతే ఆ పెట్టుబడి మొత్తం అప్పుగా మిగులుతోంది. నీరు పడిన బోర్లలోనూ సరిపడా నీరు లేకపోవడంతో రైతులు మరోసారి అప్పులు చేయాల్సి వస్తోంది.

**వరి రైతుకు నీటి కష్టాలు**

నాట్లు వేసిన వరి పొలాలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి సమస్యకు తోడు యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందకపోవడం రైతుల కష్టాలను మరింత పెంచుతోంది. ఎరువు కోసం పంపిణీ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు కూడా పలుచోట్ల కనిపిస్తున్నాయి.

**పత్తికి వాన.. తెగుళ్ల భయం**

పత్తి రైతుకు వర్షాల విషయంలో రెండు రకాల భయాలు వెంటాడుతున్నాయి. వర్షం లేకపోతే పంట ఎదుగుదల దెబ్బతింటుంది. అధిక వర్షం కురిస్తే నీరు నిలిచి తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరుగుతుండగా.. పంట చేతికి వచ్చే సమయానికి ధర ఎలా ఉంటుందోనన్న ఆందోళన నెలకొంది.

**మిర్చి రైతు పరిస్థితి మిరపలా మండుతోంది**

మిర్చి సాగులో పెట్టుబడి భారీగా ఉండటంతో రైతులు ముందుగానే అప్పులపై ఆధారపడుతున్నారు. నీటి కొరత, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు రైతుపై భారంగా మారుతున్నాయి. పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు రైతుకు మరో సవాల్‌గా మారుతున్నాయి. అధిక పెట్టుబడితో సాగు చేసే మిర్చికి గిట్టుబాటు ధరపై భరోసా లేకపోవడం రైతుల్లో ఆందోళన పెంచుతోంది.

**మొక్కజొన్న.. సోయా.. పప్పుధాన్యాలకూ కష్టాలే**

మొక్కజొన్న, సోయాబీన్, కంది, పెసర,

మిగతా 2లో

## బ్యాట్ పట్టిన పోలీస్ బాస్.. సెంచరీతో సలాం!

- 82 బంతుల్లో 126 నాటౌట్
- హైదరాబాద్ 'సి' డివిజన్ వన్డే లీగ్‌లో డీజీపీ సీవీ ఆనంద్ మెరుపు ఇన్నింగ్స్
- యూనిఫామ్‌లో డీజీపీ.. క్రీజులో ధోనీ తరహా దూకుడు
- బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సత్తా
- సికింద్రాబాద్ క్లబ్ విజయానికి కీలక పాత్ర
- పోలీస్ స్పోర్ట్స్‌పైనూ ప్రత్యేక దృష్టి

2లో



# నేపాల్‌ను మింగేసిన జలప్రళయం!

- 800కు చేరువలో మృతులు..
- 3 వేల మందికిపైగా గల్లంతు
- సొరంగాల్లో చిక్కుకున్న వందలాది మంది
- ప్రాణాల కోసం ఉత్కంఠ
- 10 వేల మందితో భారీ రెస్క్యూ ఆపరేషన్
- భారత్ సహా అంతర్జాతీయ బృందాల రంగ ప్రవేశం
- మళ్లీ పెరుగుతున్న భోటెకోషి నీటిమట్టం
- కొత్త ముప్పుపై హెచ్చరిక



**ప్రజా వాయిస్,కాఠ్మాండు.** హిమాలయ దేశం నేపాల్ ప్రకృతి ప్రకోపానికి చిగురుటాకులా వణికిపోతోంది. ఆగస్టు 26న నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో హిమనదీ కూల్చివేత, మంచు–రాళ్ల ప్రవాహం కారణంగా భోటెకోషి, త్రిశూలి నదుల్లో ఒక్కసారిగా ఉప్పొంగిన వరదలు ఊళ్లను, రహదారులను, వంతెనలను, విద్యుత్ ప్రాజెక్టులను ముంచెత్తాయి. తాజా అంతర్జాతీయ నివేదికల ప్రకారం నేపాల్‌లోనే మృతుల సంఖ్య 780 దాటగా, 3 వేల మందికిపైగా ఆచూకీ తెలియడం లేదు. 90 వేల మందికిపైగా ఈ విపత్తు ప్రభావానికి గురైనట్లు అంచనా.

**సొరంగాల్లో ప్రాణాల కోసం పోరాటం:**

వరదల ధాటికి జలవిద్యుత్ ప్రాజెక్టుల వద్ద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. అప్పర్ త్రిశూలి ప్రాంతంలోని ఓ సొరంగంలో సుమారు 350 మంది చిక్కుకుపోయి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. రెస్క్యూ బృందాలు భారీ యంత్రాలతో శిథిలాలను తొలగిస్తూ సొరంగం వద్దకు చేరుకున్నాయి. ఆక్సిజన్, కెమెరాలను లోపలికి పంపి ప్రాణాలతో ఉన్నవారి జాడ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరిని సురక్షితంగా బయటకు తీసుకురావడం ఆశలు రేకెత్తిస్తోంది.

**ఆగని ముప్పు.. పెరుగుతున్న నీటిమట్టం:**

ఒకవైపు సహాయక చర్యలు కొనసాగుతుండగానే భోటెకోషి నదిలో నీటిమట్టం మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కొండచరియలు విరిగిపడటం, రహదారులు తెగిపోవడం, ప్రతికూల వాతావరణం రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర ఆటంకంగా మారాయి. మరోవైపు గుర్తుపట్టలేని మృతదేహాలను డీఎన్ఏ నమూనాల ద్వారా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది.

**భారత్ అండగా..:**


విపత్తు వేళ పొరుగుదేశం భారత్

మిగతా 2లో

## భారతీయులకు ఉజ్బెకిస్తాన్ బంపర్ గిఫ్ట్

- 30 రోజులు వీసా ఫ్రీ!
- 30 రోజుల వీసా రహిత ప్రవేశం
- పర్యాటకం, వ్యాపారానికి ఊతం
- భారత్–ఉజ్బెకిస్తాన్ బంధం మరింత బలోపేతం
- 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- యురేనియం సరఫరాపై దీర్ఘకాలిక ఒప్పందం
- మోదీ పర్యటన వేళ కీలక ప్రకటన

2లో



## రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకేనా..?

- అజామాబాద్ భూకేటాయింపుపై ఫైర్
- సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ
- ప్రభుత్వ భూములను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర అంటూ ఆరోపణ
- నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- లేదంటే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరిక.
- మాజీ మంత్రి హరీష్ రావు.



**ప్రజావాయిస్, హైదరాబాద్.** హైదరాబాద్ అజామాబాద్‌లోని తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపు అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సుమారు రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆయిల్‌ఫెడ్‌కు అవసరమైన భూమిని కొనుగోలు చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రైవేటు వ్యక్తులకు భూమిని కట్టబెట్టే ప్రయత్నం ఎందుకని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో 22–ఏ నిషేధిత భూముల సమస్యపైనా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. వేలాది మంది బాధితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ, 50,565 ఎకరాలను 22–ఏ జాబితా నుంచి తొలగించకపోతే కలెక్టరేట్ల ముట్టడి, వంటావార్పు వంటి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## హైదరాబాద్ - బీజాపూర్ హైవేనా.. నాగుపాము డ్యాన్సా?

- ఓ వైపు నాగుపాములా మెలికలు.. మరోవైపు మ్యూజికల్ డ్యాన్సులు!
- ఎవరి స్వార్థం కోసం ఇంత డేంజర్ గా డిజైన్ చేస్తున్నారు ..?
- రేపటి విషాదానికి ఈరోజే బాట వేస్తున్నారా..? అంటూ ఎన్.హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ పై కిషన్ రెడ్డి ఫైర్
- కాలే యాదయ్య..పేదల ఇళ్లను కూల్చేస్తావ్.. మరి పద్మావతి కన్వేన్షన్ ఎందుకు కూల్చాలేకపోయవంటూ నీలదీత
- రోడ్డు వేయడం అభివృద్ధి కాదు ప్రాణాలను కాపాడేలా వేయడమే నిజమైన అభివృద్ధి
- వారం రోజుల్లో హైవేపై పూర్తిస్థాయి రివ్యూ నిర్వహిస్తామని వెల్లడించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- హైవే నిర్మాణం ప్రమాదాలకు పిలుపునిస్తోందన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

2లో

## పుష్కరాలకు తెలంగాణ ఆతిథ్యం .. భారీ ఏర్పాట్లు

- బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి
- భక్తులకు అత్యాధునిక మౌలిక వసతులు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యాలయం, కంట్రోల్ రూమ్ ఏర్పాటు.
- మంత్రి కొండా సురేఖ



**ప్రజావాయిస్, హైదరాబాద్.** తెలంగాణలో జరగనున్న గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరాలకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే కార్యాచరణను వేగవంతం చేసింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆతిథ్యం ప్రతిబింబించేలా ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారుల కార్యాలయంతో పాటు కంట్రోల్ రూమ్‌ను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ప్రముఖ ఆలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. పుష్కర ఘాట్ల నిర్మాణం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, పార్కింగ్, భద్రత తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలు పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. భారీ రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర అనుభూతిని అందించడమే లక్ష్యంగా యంత్రాంగం ముందుకు సాగుతోంది.

# రైస్ మిల్లులపై 'విజిలెన్స్' పంజా




- తెలంగాణలో బియ్యం దందా గుట్టురట్టు!
- రేషన్ బియ్యం నుంచి సీఎంఆర్ వరకు
- అక్రమాలపై ఉక్కుపాదం
- మిల్లుల్లో భారీగా నిల్వలు
- వరుస దాడులతో కలకలం
- హుజూరాబాద్‌లో 340 టన్నులు
- మిర్యాలగూడలో 21 టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్
- గ్రామం నుంచి మిల్లు వరకు అక్రమ రవాణాకు ప్రత్యేక నెట్‌వర్క్?
- డిఫాల్ట్ మిల్లులు, సీఎంఆర్ లెక్కలపై అధికారుల ప్రత్యేక దృష్టి

**ప్రజావాయిస్ డెస్క్, హైదరాబాద్.** తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లుల కేంద్రంగా సాగుతున్న అక్రమ బియ్యం దందాపై ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టడం, మిల్లుల్లో నిల్వ చేయడం, రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ పేరుతో ప్రభుత్వానికి తిరిగి అప్పగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో వరుసగా తనిఖీలు, దాడులు జరుగుతున్నాయి. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌లోని తిరుమల ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై జరిగిన దాడిలో సుమారు 340 టన్నుల రేషన్ బియ్యం గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**ఒక్క మిల్లు కాదు..**

**జిల్లాలవారీగా వెలుగులోకి అక్రమాలు**

రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై తెలంగాణలోని పలు జిల్లాల్లో అధికారులు దృష్టి సారించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతిపురం శివారులోని ఓ రైస్ మిల్లుపై ఆగస్టు 27న పోలీసులు దాడి చేసి 21 టన్నుల అక్రమ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోనూ రెండు రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం కావడం ఈ దందా ఎంత విస్తృతంగా ఉందో సూచిస్తోంది.

**గ్రామం నుంచి మిల్లు వరకు 'చైన్ సిస్టమ్'**

అధికారుల దాడుల్లో వెలుగులోకి వస్తున్న వివరాల ప్రకారం.. కొందరు దళారులు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, చిన్న వ్యాపారులు, మధ్యవర్తుల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాపై వచ్చిన తాజా నివేదికలో గ్రామాల నుంచి బియ్యం సేకరించి మధ్యవర్తుల ద్వారా మిల్లర్లకు చేరుతున్నట్లు, కొన్ని సందర్భాల్లో వాట్సాప్ లొకేషన్ల ద్వారా రవాణాను సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రేషన్ బియ్యం.. సీఎంఆర్‌గా మారుతోందా?**

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ఆరోపణ రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా ప్రభుత్వానికి అప్పగించడం. గతంలోనూ తెలంగాణలో రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చేందుకు ప్రయత్నించిన ఘటనలు వెలుగుచూశాయి. గజ్వేల్‌లో రెండు లారీల్లో తరలిస్తున్న 580 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించిన ఘటన ఇందుకు ఉదాహరణ.

**సీఎంఆర్ బకాయిలపైనా కన్ను**

రేషన్ బియ్యం అక్రమాలకే పరిమితం కాకుండా.. ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అప్పగించకుండా బకాయిలు పెట్టిన మిల్లుల పైనా అధికారులు దృష్టి పెట్టారు. గత కొన్నేళ్లుగా బియ్యం ఇవ్వకుండా ఉన్న మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు కొనసాగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మిల్లులకు కేటాయించిన ధాన్యం, తిరిగి ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం, వాస్తవంగా మిల్లుల్లో ఉన్న నిల్వల మధ్య తేడాలను పరిశీలించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**అసలు నెట్‌వర్క్ ఎవరిది?**

ఒకచోట బియ్యం పట్టుబడటం కంటే.. అది ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సేకరించారు? ఎవరి ద్వారా మిల్లుకు చేరింది? ఎక్కడ నిల్వ చేశారు? రీసైక్లింగ్ తర్వాత ఎక్కడికి తరలించారు? సీఎంఆర్‌గా ఎవరికి చూపించారు? అనే అంశాలపై లోతైన దర్యాప్తు అవసరమని ప్రజల్లో చర్చ జరుగుతోంది. హుజూరాబాద్ తాజా దాడిలో రెండు ట్రాలీల్లో సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న సమయంలో పట్టుబడినట్లు అధికారులు వెల్లడించారు.

**పేదల బియ్యానికి రక్షణ ఎక్కడ?**

ప్రభుత్వం పేదలకు ఉచితంగా లేదా సబ్సిడీపై అందించే బియ్యం పక్కదారి పడితే దాని ప్రభావం నేరుగా ఆహార భద్రతపై పడుతుంది. అప్పుడప్పుడు దాడులు చేసి బియ్యం పట్టుకోవడం మాత్రమే కాకుండా.. రేషన్ షాపు నుంచి మిల్లు వరకు ఉన్న సరఫరా వ్యవస్థలో ఎక్కడ లోపం జరుగుతుందో గుర్తించి శాశ్వతంగా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. రైస్ మిల్లుల్లోని స్టాక్, సీఎంఆర్ లెక్కలు, రవాణా వాహనాలు, రేషన్ డీలర్ల లావాదేవీలు, మధ్యవర్తుల నెట్‌వర్క్‌పై సమగ్ర ఆడిట్ జరిగితే అసలు దందా పరిమాణం మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రస్తుతం వరుస దాడులతో రైస్ మిల్లర్లలో ఆందోళన నెలకొంది. అయితే పట్టుబడిన ప్రతి కేసులోనూ పూర్తి దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలను నేరంగా నిర్ధారించకుండా, అధికారుల విచారణలో వెల్లడైన అంశాలుగానే చూడాల్సి ఉంటుంది.

# వాన రాక.. నీరు లేక.. రైతన్నకు కన్నీళ్లే!

మొదటి పేజీ తరువాయి

మినుములు తదితర పంటల రైతుల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. వర్షాల విరామం పంటల ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉండగా.. అధిక వర్షాలు వస్తే నీరు నిలిచి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. పెట్టుబడులు పెరుగుతున్నా దిగుబడి, ధరపై భరోసా లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

**బత్తాయి రైతుకు దిక్కుతోచని పరిస్థితి**

బత్తాయి తోటల రైతుల కష్టాలు మరో రకంగా ఉన్నాయి. తోటల నిర్వహణకు నీరు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు పెరుగుతున్నాయి. పంట వచ్చిన తర్వాత మార్కెట్ ధరల్లో మార్పులు, కోత–ప్యాకింగ్–రవాణా ఖర్చులు రైతు ఆదాయాన్ని తగ్గిస్తున్నాయి. సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో రైతు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది.

**కూరగాయల రైతుకు ధరల దెబ్బ**

టమాటా, వంకాయ, బెండ, క్యాబేజీ తదితర కూరగాయల రైతుల పరిస్థితి కూడా అనిశ్చితంగానే ఉంది. ఒకసారి ధరలు పెరిగితే మరోసారి పడిపోవడం సాధారణంగా మారింది. నిల్వ సదుపాయాలు లేక పంటను వెంటనే అమ్మాల్సి రావడంతో తక్కువ ధర వచ్చినా రైతు తప్పనిసరిగా విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**పెట్టుబడి పెరుగుతోంది.. ఆదాయం ప్రశ్నార్థకం**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, ట్రాక్టర్, బోర్లు, మోటార్లు, డీజిల్ ఇలా ప్రతి దశలో రైతుపై ఖర్చు పెరుగుతోంది. పంట చేతికి వచ్చిన తర్వాత మాత్రం ధరను రైతు నిర్ణయించే పరిస్థితి లేదు. దీంతో మంచి దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేకపోతే రైతు చేతిలో మిగిలేది అప్పులే.

**మాటలు కాదు.. తక్షణ చర్యలు కావాలి**

వర్షాభావ ప్రాంతాల్లో పంటల పరిస్థితిని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అంచనా వేయాలి. బోర్లు వేసి నష్టపోయిన రైతులకు, నీటి కొరతతో పంటలు దెబ్బతిన్న రైతులకు అవసరమైన సహాయం అందించాలి. ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలి. మిర్చి, బత్తాయి, పత్తి తదితర వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా కల్పించాలి.ఆకాశం వైపు చూస్తే వాన కోసం ఎదురుచూపులు.. భూమి వైపు చూస్తే ఎండుతున్న పంటలు.. బోరు వైపు చూస్తే అప్పులు.. ఎరువు కేంద్రం వైపు చూస్తే క్యూలు.. మార్కెట్ వైపు చూస్తే ధరపై అనిశ్చితి. తెలంగాణ రైతన్నను చుట్టుముట్టిన ఈ సమస్యల వలయం నుంచి బయటపడేయడానికి తక్షణ ప్రభుత్వ చర్యలే ఇప్పుడు అన్నదాతకు అండగా నిలవాలి.

# అనుమతులు లేకుండా చేపల చెరువుల తవ్వకాలు

- ఎవరికి కనిపించకుండా చుట్టూ ప్రహరీ గ్రీన్ మాట్ ఏర్పాటు
- నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలు
- బస్వపూర్లో వెలుగు చూసిన మరో అక్రమ చెరువుల తవ్వకం





**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** సింగూర్ ప్రాజెక్టు పదివాహక ప్రాంతం చుట్టూ ఇష్ట రాజ్యాంగ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తులు చేపల చెరువులను తవ్వుతూ మంజీరా జలాలనే కాకుండా పంట పొలాలను సైతం కలుషితం చేస్తున్నారు. దీనికి దర్శనం గతంలో జరిగిన సాయి పేట, ఖాదరాబాద్, కన్సన్పల్లి లో అక్రమ చేపల చెరువుల అక్రమ తవ్వకలు చేస్తే ప్రజా వాయిస్ వెలుగులోకి తీసుకు వచ్చింది . దీనికి స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులో ఏర్పాటుచేసిన చేపల చెరువులతో పాటు పట్టబంలో అనుమతులు లేకుండా తవ్వకాలు చేసిన చేపల చెరువులను సైతం పూడ్చి చేశారు. అదే తరహాలో పుల్కల్ మండలానికి కోతపేట దూరంలో ఉన్న బస్వాపూర్ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ చెరువుల తవ్వకాలు చేస్తున్నారు. దీనికి పంచాయతీ తీర్మానం కానీ పంచాయతీ నుంచి అనుమతి లేకుండానే తవ్వకాలు చేయడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే చేపల చెరువులతో చెరువులో నీటితో పాటు పంట పొలాలు కలుషితం అయ్యే అవకాశం ఉందని రైతుల ఆరోపిస్తున్నారు. చేపల పెంపకం కోసం చికెన్, మటన్ సంబంధించిన వేస్ట్ ను వీటికి ఆహారంగా వినియోగిస్తారు. దీంతో ఆ ప్రాంతంలో పశువులు వెళ్లాలన్న కూడా ఆ వాసనకు వెళ్లే అవకాశం లేదని... చేపల చెరువులో నుంచి నీటిని తీసే క్రమంలో పంట పొలాల్లోకి వస్తే కాళ్లు బొబ్బలు పోల్చడం... ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. చెరువు కట్టకు ఆనుకొని చేపల చెరువులను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేపల చెరువుల తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బ్యాట్ పట్టిన పోలీస్ బాస్.. సెంచరీతో సలాం!



**ప్రజా వాయిస్ డెస్క్, హైద రాబాద్.** యూనిఫామ్‌లో ఉంటే పోలీస్ బాస్.. బ్యాట్ పట్టి క్రీజులోకి దిగితే మాత్రం దూకుడు బ్యాటర్! తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మరోసారి క్రికెట్ మైదానంలో తన సత్తా చాటారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'సి' డివిజన్ వన్డే లీగ్‌లో ఆదివారం సికింద్రాబాద్ క్లబ్ తరఫున బరిలోకి దిగిన ఆయన అద్భుతమైన సెంచరీతో అదరగొట్టారు. ఓపెనర్‌గా క్రీజులోకి వచ్చిన సీవీ ఆనంద్ కేవలం 82 బంతుల్లోనే 126 పరుగులతో అజేయంగా నిలిచి ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించారు. బౌండరీలు, సిక్సర్లతో స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించిన ఆయన ఇన్నింగ్స్‌తో సికింద్రాబాద్ క్లబ్ భారీ స్కోరు సాధించగా, బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయానికి కీలకంగా నిలిచారు. పోలీస్ విధుల్లో నిత్యం బిజీగా ఉండే డీజీపీ.. తనకున్న క్రికెట్ అభిరుచిని కొనసాగిస్తూ ఇంతటి స్థాయిలో లీగ్ మ్యాచ్‌లో ఆడటం క్రీడా వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా మారింది. యూనిఫామ్‌లో డీజీపీగా.. బ్యాట్ పడితే ఎంఎస్ ధోనీలా! అంటూ ఆయన ఇన్నింగ్స్‌పై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ లీగ్‌లో ఆయన నమోదు చేసిన తొలి శతకం కావడం ఈ ప్రదర్శనకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఇదిలా ఉండగా, ఇటీవల భారత స్టార్ పేసర్, డీఎస్పీ మహ్మద్ సిరాజ్ డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలవడం కూడా క్రీడా వర్గాల్లో ఆసక్తి కలిగించిన విషయం తెలిసిందే. తెలంగాణ పోలీస్ శాఖలో క్రీడలకు ప్రాధాన్యమిస్తూ, గత జూలైలో డీజీపీ సీవీ ఆనంద్ నేతృత్వంలో 5వ తెలంగాణ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్–2026 ప్రారంభమైంది. ఇందులో భాగంగా నవంబర్ 17 నుంచి 19 వరకు ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక టీ–20 క్రికెట్ క్లస్టర్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణకు, మైదానంలో ఆటకు సమాన ప్రాధాన్యమిస్తూ సీవీ ఆనంద్ చూపుతున్న ఆసక్తి పోలీస్ శాఖలో క్రీడా స్ఫూర్తికి మరింత ఊతమిస్తోంది. ఖాకీలో కర్తవ్యం.. క్రీజులో దూకుడు.. అన్నట్లుగా డీజీపీ సీవీ ఆనంద్ 126 పరుగుల అజేయ శతకంతో మరోసారి తనలోని క్రికెటర్‌ను ఆవిష్కరించారు.

# భారతీయులకు ఉజ్బెకిస్తాన్ బంపర్ గిఫ్ట్

**ప్రజా వాయిస్,ఇంటర్నేషనల్ డెస్క్.** భారతీయులకు ఉజ్బెకిస్తాన్ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఇకపై భారత పౌరులు 30 రోజుల వరకు వీసా లేకుండానే ఉజ్బెకిస్తాన్‌లో ప్రవేశించి బస చేసే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయేవ్ ప్రకటించారు. తాష్కెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన చర్చల సందర్భంగా ఈ నిర్ణయం వెలువడింది. ప్రజల మధ్య రాకపోకలు, పర్యాటకం, వ్యాపార సంబంధాలను మరింత పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మిర్జియోయేవ్ తెలిపారు. మోదీ పర్యటనలో భారత్–ఉజ్బెకిస్తాన్ సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. అణుఇంధన రంగంలో ఉజ్బెకిస్తాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే ఏర్పాటుపైనా ఇరు దేశాలు ముందడుగు వేశాయి. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, రక్షణ, ఔషధాలు, ఆరోగ్యం, ఐటీ, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు 11 ఒప్పందాలు కుదిరాయి. ఈ పరిణామాలతో భారతీయులకు ఉజ్బెకిస్తాన్ ప్రయాణం సులభతరం కావడంతోపాటు రెండు దేశాల మధ్య పర్యాటక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# నేపాల్‌ను మింగేసిన జలప్రళయం!



నేపాల్‌కు అండగా నిలిచింది. సహాయక సామగ్రితో పాటు వైద్య, ఫోరెన్సిక్ నిపుణుల బ ృందాల ను ప ంపించింది. నాలుగో విడతలో మరో 11 టన్నుల సహాయక సామగ్రిని భారత్ పంపగా, మొత్తం 68.5 టన్నుల వరకు సహాయం అందించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. రెస్క్యూ, మృతదేహాల గుర్తింపు, మౌలిక వసతుల పునరుద్ధరణలోనూ సహకారం కొనసాగుతోంది.

**హిమాలయాలకు ప్రకృతి హెచ్చరిక:**

నేపాల్‌లో జరిగిన ఈ మహావిపత్తు కేవలం ఒక దేశాన్ని కుదిపేసిన విషాదం మాత్రమే కాదు.. హిమాలయ ప్రాంతంలో పెరుగుతున్న హిమనదీ విపత్తులు, ఆకస్మిక వరదలు, వాతావరణ మార్పుల తీవ్రతకు మరో హెచ్చరిక. మిగిలిన వారి ప్రాణాలను కాపాడటం, గల్లంతైన వారి ఆచూకీ కనుగొనడం ఇప్పుడు నేపాల్ ముందున్న అతిపెద్ద సవాలు. వరద తగ్గినా.. నేపాల్ కన్నీటి ప్రవాహం మాత్రం ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు.

# కాంక్రీట్ కోసం 30 ఏళ్ల పచ్చదనానికి కోత.!

- అల్కాపూర్‌లో భారీ వృక్షాల నేలమట్టం
- వాల్టా నిబంధనలు గాలికొదిలారా.?
- బిల్డర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు



**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:** అభివృద్ధి పేరుతో పచ్చదనానికి ముప్పు పొంచి ఉందా.? అని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకున్న వృక్షాల తొలగింపు ఘటన ఈ ప్రశ్నకు తావిస్తోంది. నార్సింగి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్ నంబర్–8లో ఓ భవన నిర్మాణ పనుల కోసం సుమారు 30 ఏళ్లుగా పెరిగిన భారీ వృక్షాలను తొలగించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయన్న కారణంతో చెట్లను నరికివేశారని కాలనీవాసులు చెబుతున్నారు.అయితే భారీ వృక్షాలను తొలగించేందుకు సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్నారా.? వాల్టా నిబంధనలను పాటించారా.? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.అనుమతులు లేకుండా చెట్లను తొలగించి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

ఒకవైపు నగరంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతుండగా, మరోవైపు దశాబ్దాల నాటి వృక్షాలు కనుమరుగవుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ టౌన్ ప్లానింగ్,అటవీ శాఖలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చెట్ల తొలగింపునకు సంబంధించిన అనుమతులు,నిర్మాణ నిబంధనలను పరిశీలించాలని కోరుతున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

చెట్ల తొలగింపులో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అధికారుల విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.నిర్మాణాల కోసం పచ్చదనాన్ని బలిచేయకుండా అధికారులు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని, అక్రమంగా చెట్లు నరికివేతకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఘటనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.






# హైదరాబాద్ - బీజాపూర్ హైవేనా.. నాగుపాము డ్యాన్సా?

**చేవెళ్ల (ప్రజావాయిస్ ):** అరే.. ఇదేం హైవే? మ్యూజికల్ డ్యాన్స్ చేస్తున్నట్టుంది.. నాగుపాము డ్యాన్స్ చేస్తున్నట్టుంది!అంటూ హైదరాబాద్–బీజాపూర్ హైవేపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గరం గరం అయ్యారు. చేవెళ్ల దగ్గర మల్కాపూర్ వద్ద కొత్తగా కడుతున్న రోడ్డును ఆదివారం ఉదయం స్వయంగా చూసిన ఆయన.. అక్కడి డీప్ కర్వ్ (పెద్ద మూలమలుపు) చూసి అధికారులపై మండిపడ్డారు.మరీ ఇంత దారుణంగా రోడ్డు ఎలా కడతారు? అంటూ ఎన్.హెచ్.ఏ.ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను గట్టిగా ప్రశ్నించారు. దాదాపు 46 కిలోమీటర్ల రోడ్డులో 30కి పైగా మలుపులుంటే.. ఈ రోడ్డుమీద జనం ఎలా సేఫ్‌గా పోవాలి? అంటూ నిలదీశారు.ఇప్పటికే ఇదే దారిలో పాత రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో జనం ప్రాణాలు పోయిన దాఖలాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు కొత్త హైవేలో కూడా ఇన్ని మలుపులుంటే.. రేపు పరిస్థితి ఏంటని జనం భయపడుతున్నారు.నాగ్‌పూర్ హైవే, విజయవాడ హైవే, బాంబే హైవేలు చూసినవాళ్లకు ఈ రోడ్డు పరిస్థితి తెలిస్తే ఆశ్చర్యమేనంటూ కిషన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎవరి స్వార్థం కోసం ఈ రోడ్డును ఇలా డిజైన్ చేస్తున్నారు ?అని ప్రశ్నించారు. వారం రోజుల్లో హైవేపై పూర్తిస్థాయి రివ్యూ పెడతానని చెప్పారు.స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యపై కూడా కిషన్‌రెడ్డి గట్టిగానే మాట్లాడారు. పేదోళ్ల ఇండ్లు మాత్రం కూల్చేస్తావ్.. మరి పద్మావతి కన్వెన్షన్‌ను ఎందుకు కూల్చలేకపోయావ్? అంటూ ప్రశ్నించారు.హైవే వల్ల రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తామని, అదే సమయంలో వికారాబాద్ ప్రాంతాన్ని రాబోయే రోజుల్లో మంచి టూరిజం ప్రాంతంగా డెవలప్ చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు.ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా రోడ్డును చూసి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఉంటే ఇది రోడ్డు కాదు.. ప్రమాదాలకు పిలుపే అన్నట్టుగా ఆవేదన వ్యక్తం చేశారు.పాత రోడ్డుపై ప్రాణాలు పోయాయి..కొత్త రోడ్డులోనూ మలుపులు అలాగే ఉన్నాయి..ఇకనైనా అధికారులు మేల్కొనిజనం ప్రాణాలకు భరోసా ఇస్తారా? అన్నదే ఇప్పుడు స్థానికుల ప్రశ్నగా మారింది.

# కోదాడ బంద్.. ఎవరి ప్రయోజనం కోసం..?

- ప్రజా సమస్యల కోసమా? రాజకీయ స్వార్థం కోసమా.?
- చిరు వ్యాపారులు, కూలీల ఇబ్బందులు పట్టవా.?
- ప్రశాంతంగా ఉన్న పట్టణంలో ఆందోళన ఎందుకు?
- రావెళ్ల కృష్ణారావు



**ప్రజా వాయిస్,కోదాడ:** కోదాడ పట్టణంలో బంద్‌కు పిలుపునివ్వడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న చర్చ మొదలైంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసమా, లేక రాజకీయ ప్రయోజనాల కోసమా అన్న ప్రశ్నలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బంద్‌లతో రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడతారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా తమ పనులు తాము చేసుకుంటున్నారని, పోలీసులు గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మరోవైపు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు.గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, మున్సిపల్, పాలకవర్గాలు తమ విధులు నిర్వహిస్తున్న తరుణంలో బంద్‌కు పిలుపునివ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను రాజకీయ అంశంగా మార్చడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ప్రజల కోసం బంద్‌నా,రాజకీయ ప్రయోజనాల కోసమా అనే ప్రశ్న ఇప్పుడు కోదాడలో చర్చనీయాంశంగా మారిందని రావెళ్ల కృష్ణారావు అన్నారు.




# కొడంగల్ పరుగు.. వికారాబాద్ వెనుకడుగు..!

- సిఎం సొంత నియోజక వర్గంలో రూ.4,369 కోట్లకు పైగా పనులకు శంకుస్థాపనలు
- మరో రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- వికారాబాద్ లో రూ.261 కోట్ల హ్యాం రోడ్డు పనులు ప్రారంభమైనా..
- ఆశించిన స్థాయిలో అభివృద్ధిపై స్థానికుల్లో చర్చ
- అభివృద్ధి హామీలు ఎన్నాళ్లు?
- సమస్యలకు పరిష్కారం ఎప్పుడంటూ ప్రజల ప్రశ్న

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లాలో చర్చ మొదలైంది. కొడంగల్ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ముందుకు సాగుతుండగా.. వికారాబాద్ జిల్లా కేంద్రం అభివృద్ధి విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో పనులు కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కొడంగల్‌కు వేల కోట్ల ప్రణాళికలు..**

కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకంతో పాటు విద్య, వైద్య రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.4,369 కోట్లకు పైగా విలువైన పనులకు శంకుస్థాపనలు జరిగాయి. వీటితో పాటు దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన మరిన్ని ప్రాజెక్టులు ప్రణాళికల్లో ఉన్నట్లు సమాచారం.

**వికారాబాద్‌కు రూ.3 వేల కోట్ల హామీ..**

వికారాబాద్ జిల్లా కేంద్రాన్ని సుమారు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గతంలో ప్రకటించారు. ఇటీవల వికారాబాద్ నియోజకవర్గంలో రూ.261 కోట్ల వ్యయంతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రోడ్డు పనులతో పాటు పలు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రారంభించారు.

**అభివృద్ధిపై స్థానికుల్లో చర్చ..**

కొడంగల్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ పనులు వేగంగా కొనసాగుతుండగా, వికారాబాద్ జిల్లా కేంద్రానికి ప్రకటించిన రూ.3 వేల కోట్ల అభివృద్ధి ప్రణాళికలు ఎప్పుడు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చుతాయనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీలకతీతంగా అభివృద్ధే లక్ష్యమని చెబుతున్న నేపథ్యంలో.. రెండు నియోజకవర్గాల అభివృద్ధి పనుల వేగంపై రాజకీయ, ప్రజా వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.



# లంబాడీల జోలికొస్తే ఖబడ్దార్

- గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలా?
- లంబాడీ ఉద్యోగులను అవమానిస్తే సహించేది లేదు
- ఉద్యోగుల హక్కులు, గౌరవం కోసం పోరాడతాం
- మల్లయ్య యాదవ్ వ్యాఖ్యలను ఖండించిన ఎల్‌హెచ్‌పీఎస్

**ప్రజా వాయిస్,కోదాడ:** గిరిజన లంబాడీల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు మండిపడ్డారు. లంబాడీ ఉద్యోగుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. గిరిజన లంబాడీ ఉద్యోగులను అన్ని విధాలుగా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. లంబాడీలను అవమానించేలా ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా తగిన రీతిలో సమాధానం చెబుతామని ఎల్‌హెచ్‌పీఎస్ మాలోత్ సైదా నాయక్, ఏడవ వార్డు కౌన్సిలర్ చైతన్య నాయక్ , రవి నాయక్ , రాజు నాయక్, హాజీ నైట్ క్, పద్మాబాయి, నిఖిల్ నాయక్ , గోపి రాథోడ్ ,డీవీఆర్ నాయక్ ,దుర్గాబాయి, నాగేందర్, పాపా నాయక్ , శీను నాయక్ , పరశురాం నాయక్ తదితర నాయకులు స్పష్టం చేశారు.

# రూ.27కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన మంత్రి




**ప్రజావాయిస్/వికారాబాద్:** వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.. ఆదివారం స్థానిక వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న ఆధునీకరణ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు తెలంగాణలోనే 42 రైల్వే స్టేషన్ లు ఏకకాలంలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో కవచ్ టెక్నాలజీ ద్వారా ప్రమాదాల నివారణకు దోహదపడుతుందన్నారు. బుల్లెట్ ట్రైన్ మన తెలంగాణకు వస్తే దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ నిలుస్తుందన్నారు. బుల్లెట్ ట్రైన్ నడవడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా నివారించవచ్చన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ 27 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ నుండి ప్రయాణికులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ప్రయాణించగలుగుతారన్నారు.వికారాబాద్ స్టేషన్ లో ఫోర్ విల్లర్ పార్కింకింగ్ 50కి పెంచడం జరిగిందన్నారు. టు వీలర్ పార్కింకింగ్ 150కి పెంచడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్.2 లిఫ్టులు. మరియు క్యాంటీన్ దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం చివరి వరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అండర్ బ్రిడ్జి సమస్యలు తొలగించడం కొరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి సెంట్రల్ రైల్వే మినిస్టర్ గారితో సమస్య పరిష్కరిస్తామన్నారు. అతి తక్కువ కాలంలోనే నేషనల్ హైవే పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, రైల్వే డివిజనల్ మేనేజర్ సికింద్రాబాద్ ఆర్. గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, బిజెపి రాష్ట్ర సెల్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, రమేష్, కేయస్.రత్నం, ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, అధికారులు, బీజేపీ నాయకులు,పాల్గొన్నారు.

# రోడ్డు మధ్యలో బోరు.. మూలలో కరెంటు స్థంభం

- రామగుండం కార్పొరేషన్‌లో వింత పనులు

**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రోడ్ల వెడల్పు, నూతన రహదారుల నిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు, క్షేత్రస్థాయిలో మాత్రం నాసిరకం, అశాస్త్రీయ పనులతో చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు నిజంగా నిద్రపోతున్నారా లేక నిద్రపోతున్నట్లు నటిస్తున్నారా అర్థం కాక స్థానిక ప్రజలు, వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**మలుపులో మృత్యుపాశం.. లక్ష్మీనగర్ లో బిఎస్ఎన్ఎల్ పోలు!**

రోడ్ల వెడల్పు కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని లక్ష్మీనగర్ ప్రాంతంలో నూతనంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి చాలా రోజులైంది. అయితే, అత్యంత ప్రాధాన్యత కలిగిన మూలమలుపు (కర్వ్) వద్దే ప్రమాదకరంగా నిలబడి ఉన్న బిఎస్ఎన్ఎల్ స్తంభాన్ని తొలగించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. రహదారిని వెడల్పు చేశారు కానీ, రోడ్డు మలుపులో ఉన్న స్తంభాన్ని తొలగించడం పూర్తిగా మరచిపోయారు. రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేక ఈ మూలమలుపు వద్ద వాహనదారులు స్తంభాన్ని ఢీకొని ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.





# రైతు కష్టంపై 'ధరల దందా'..?

- మొయినాబాద్‌లోని శ్రీ బాలాజీ ఫర్టిలైజర్‌పై అన్నదాతల ఆగ్రహం
- ఒకే షాపు.. ఒకే ఎరువు.. ఒక్కొక్కరికి ఒక్కో రేట్..?
- సరైన బిల్లులు, రసీదులు ఇవ్వడం లేదంటూ రైతుల ఆరోపణలు
- ప్రజావాయిస్ వివరణ కోరగా..

  పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న అగ్రికల్చర్ అధికారి

**మొయినాబాద్ (ప్రహవాయిస్ ):** రైతన్న కష్టం ఎవరికీ తెలియనిది కాదు.. ఎండనకా, వాననకా పొలంలో కష్టపడి పంట పండిస్తే.. ఎరువు కొనేటప్పుడే ధరల తేడాలు ఎదురవుతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. మొయినాబాద్‌లోని శ్రీ బాలాజీ ఫర్టిలైజర్‌లో ఎరువుల అమ్మకాలపై కనకమామిడికి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అన్నా.. ఒకే ఎరువు కదా.. మరి మాకు ఒక రేటు, ఇంకొకరికి ఇంకో రేటెందుకు?అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. యూరియా, గోధుమలు, కౌన్సిల్ యాక్టివ్ తదితర వాటిని ఒక్కొక్కరికి ఒక్కో ధరకు అమ్ముతున్నారంటూ ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కౌన్సిల్ యాక్టివ్‌ను మొయినాబాద్‌లో ఒక రేటు, వెంకటాపూర్‌లో మరో రేటుకు ఇస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు.ఇక తాము సరుకు కొన్నప్పుడు సరైన బిల్లు, రసీదు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా.. అందరికీ ఒకే తీరుగా సరఫరా జరగడం లేదని కొందరు రైతులు చెబుతున్నారు. ఒకే షాపులో ఒకే సరుకుకు రేట్లు ఎందుకు మారుతున్నాయో అధికారులు నిగ్గు తేల్చాలని అన్నదాతలు కోరుతున్నారు.రైతుల ఆరోపణలపై ప్రజావాయిస్ సంబంధిత అగ్రికల్చర్ అధికారిని వివరణ కోరగా.. విషయాన్ని పరిశీలించి తప్పు జరిగితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.అయితే అధికారులు ఫిర్యాదు వస్తేనే స్పందించకుండా.. ఎరువుల దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని రైతులు కోరుతున్నారు. రైతన్నను ఇబ్బంది పెట్టే ధరల తేడాలు, బిల్లుల వ్యవహారంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిజానిజాలు బయటపెట్టాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.




# వర్షం మాటున భారీగా కాలుష్య జలాలు విడుదల

- వర్షం వస్తే చాలు పరిశ్రమలకు పండుగే
- యదేచ్ఛగా కాలుష్య జలాలు విడుదల చేస్తున్న పరిశ్రమలు
- పిసిబి అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం శూన్యం

**పటాన్ చెరువు ప్రజావాయిస్** వర్షం వస్తే చాలు పరిశ్రమల యజమాన్యాలు విచ్చలవిడిగా కాలుష్య వ్యర్థ జలాలను భారీగా విడుదల చేస్తున్నారు పటాన్చెరువు నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతాలైన పాశమైలారం ఇస్నాపూర్ పటాన్చెరువు ఐడిఏ బొల్లారం బొంతపల్లి గుమ్మడిదల గడ్డపోతారం కాజీపల్లి తదితర ప్రాంతాలలో భారీగా పరిశ్రమలు ఏర్పాటు చేశారు వర్షాకాలంలో పరిశ్రమల యాజమాన్యాలు ఏమాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వర్షం వస్తే చాలు కాలుష్య జలాలను వర్షం మాటున భారీగా విడుదల చేస్తున్నారు ఈ వ్యర్థ కాలుష్య జలాలతో చాలా గ్రామాలలోని ప్రజలు శ్వాస కోశ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు చెరువులు కుంటలు పంటలకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు ఈ సి బి అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసిన ధర్నాలు రాస్తారోకోలు చేసిన నామమాత్రంగా పరిశ్రమ యాజమాన్యాలకు నామమాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు కాలుష్య వ్యర్థ జలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకొని వ్యర్థజలాలను వదలకుండా పరిశ్రమ యజమాన్యాలను కట్టడి చేయాలని స్థానికులు వాపోతున్నారు ఈ కాలుష్య జలాల వల్ల పలు ప్రాంతాలలోని చెరువులలోకి భారీగా కాలుష్య జలాలు చేరి పశువులు గేదెలు మరణించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి మృత్యుకారుల ఆధార జీవమైన చెరువులు కాలుష్యం కావడం వలన చేపలు మృతి చెందిన సంఘటనలు నియోజకవర్గంలో తరచూ జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని మృత్యుకారులు అంటున్నారు కొన్ని ప్రాంతాలలో నైతే రాత్రి సమయాలలో ట్యాంకర్ల ద్వారా అటవీ ప్రాంతాలలో కాలుష్య జలాలను వదిలేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలగా విడిగా కాలుష్య వ్యర్ధ జలాలను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కాలుష్య జలాలు విడుదల చేస్తున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు








## శ్రీరాంపూర్‌లో పెరుగు గొడవ కలకలం

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- బీర్ బాటిల్స్ దాడి ప్రచారంలో నిజం లేదన్న పోలీసులు!

**ప్రజా వాయిస్ మంచిర్యాల/** క్రైమ్ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఓ విచిత్ర సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బిర్యానీ సెంటర్‌లో పెరుగు కోసం తలెత్తిన చిన్న వివాదం ఘర్షణకు దారితీసింది. అయితే ఈ ఘటనపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పోలీసులు స్పష్టం చేస్తూ అధికారికంగా ప్రెస్ నోట్ విడుదల చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్ట్ 29వ తేదీ రాత్రి శ్రీరాంపూర్‌లోని శివాజీ బిర్యానీ సెంటర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పొన్నాల ప్రశాంత్, పొన్నాల కిషోర్ అనే వ్యక్తులు బిర్యానీ సెంటర్‌లో ఉన్న మనుబోతుల ప్రశాంత్ అనే వ్యక్తిని హోటల్ యజమానిగా భావించి పెరుగు అడగడంతో వివాదం మొదలైంది. యజమాని కాదని చెప్పినా వినిపించుకోకుండా ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. ఈ క్రమంలో నిందితులు ఫిర్యాదుదారుడిపై చేతులతో మరియు వాటర్ బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన శ్రీరాంపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారుఅయితే ఈ గొడవపై సోషల్ మీడియాలో మరియు కొన్ని వార్తా కథనాల్లో నిందితులు 'బీర్ బాటిల్స్'తో దాడి చేసినట్లు జోరుగా ప్రచారం సాగింది. దీనిపై పోలీసులు స్పందిస్తూ ఆ ప్రచారమంతా అవాస్తవమని తేల్చిచెప్పారు. దర్యాప్తులో లభించిన ఆధారాల ప్రకారం.. బాధితుడిపై ప్లాస్టిక్ థమ్సప్ బాటిళ్లు మరియు చేతులతో మాత్రమే దాడి జరిగినట్లు నిర్ధారణ అయింది. అంతేకాకుండా ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ఎవరూ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లలేదని స్పష్టం చేశారు.మరోవైపు నిందితుల గత నేరచరిత్రను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, చట్టపరమైన నిబంధనల ప్రకారం వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేశారు. శ్రీరాంపూర్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి వాస్తవాలు నిర్ధారించుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, అసత్య ప్రచారాలు చేయవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల సంక్షేమమే లక్ష్యం.. సమస్యల పరిష్కారమే ధ్యేయం

- .ములుగు జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గడ్డం క్రాంతి కుమార్ ఎన్నిక.
- "నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. పోలీసు సిబ్బందికి అండగా ఉంటా."



**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, ఆగస్టు 30:/** ములుగు జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నూతన జిల్లా కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో క్లూస్ టీమ్‌కు చెందిన గడ్డం క్రాంతి కుమార్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.తెలంగాణ రాష్ట్రం లో నూతన ములుగు జిల్లా ఏర్పడిన తర్వాత పోలీసు అధికారుల సంక్షేమ సంఘానికి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో భాగంగా, తొలిసారిగా జిల్లా స్థాయిలో ఎన్నికలు జరగడం విశేషంగా నిలిచింది.నూతన కమిటీలో..... ఉపాధ్యక్షులుగా ఎస్సైలు ఎస్.కే. తాజుద్దీన్, గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్, కార్యదర్శిగా సీఐ ధారం సురేష్, కోశాధికారిగా సర్వేష్, జాయింట్ సెక్రటరీగా నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్, ఈసీ మెంబర్లుగా: పెండ్యాల శంకర్, రాజీవ్, అనిల్, శోభన్, కె. స్వప్న, తిరుపతి ఎన్నిక కావడం జరిగింది.

**ములుగు జిల్లాలో తొలిసారి ఎన్నికలు.. అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉంది"**

నూతన అధ్యక్షుడు గడ్డం క్రాంతి కుమార్ మాట్లాడుతూ..... ములుగు జిల్లాలో పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ఎన్నికలు తొలిసారిగా జరగడం సంతోషంగా ఉందన్నారు. అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉన్నప్పటికీ, తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో కొనసాగనున్న కమిటీ ద్వారా పోలీసు సిబ్బంది సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే పోలీసు సిబ్బంది సమస్యలను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని గడ్డం క్రాంతి కుమార్ స్పష్టం చేశారు. సిబ్బంది సంక్షేమానికి సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**"ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు:"**

తన ఎన్నికకు సహకరించిన జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, పోలీసు కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది, ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు



## వరి రైతుల కన్నీటి బాధ

- వరి పంట ఎండుతుంటే రైతు గుండె మండుతోంది
- వాన జాడ లేక బీటలు వారుతున్న భూమి
- వాడిపోతున్న పంటబోర్లలో నీరు లేక కళ్లముందే కరిగిపోతున్న రైతుల ఆశలు
- అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు ఆవిరేనా పంట చేతికందేనా
- ఆకాశం వైపు కన్నీటి చూపులు వాన కోసం దీనంగా రైతుల ఎదురుచూపులు

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు** మండలం వర్షాలు ముఖం చాటేయడంతో గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నాట్లు వేసిన తర్వాత సరైన వర్షాలు లేకపోవడంతో పొలాల్లో తేమ తగ్గిపోయి బీటలు వారుతున్నాయి. పంటలు పచ్చగా ఉండాల్సిన సమయంలో ఎండల తీవ్రతతో వాడిపోతుండటంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది.వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు వరి సాగుకు భారీగా పెట్టుబడులు పెట్టారు. నాట్లు వేసిన తర్వాత వర్షాలు కురిసి, బోర్ల నుంచి కూడా నీరు అందుతుందని భావించారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా మారడంతో పంటను కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు అందకపోవడంతో పొలాలకు తడులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వర్షాలు కురిసి పంటలకు ప్రాణం పోయాలని, అధికారులు పరిస్థితిని పరిశీలించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో వరి పంటపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



## పవనసుత బియ్యం కుంభకోణం లో వొల్లాల సత్యనారాయణే 'కర్త, కర్మ, క్రియా'!

- అక్రమ మార్గాల్లో సాగిన రవాణా చిట్టీలు, ఉమ్మడి సంతకాల నిధుల లీలలు బయట పడాల్సిందే
- కేంద్ర విజిలెన్స్, ఈడీ రంగంలోకి దిగాలి
- సూరయ్యపల్లి శ్రీలక్ష్మి రైస్ మిల్లు లావాదేవీలపై బ్యాంకు ఖాతాల పరిశీలన అత్యవసరం
- ప్రభుత్వ ధనాన్ని పూర్తిస్థాయిలో రికవరీ చేయాలి
- మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్,

**ప్రజా వాయిస్ మంథని** మండలంలో తీవ్ర కలకలం రేపిన 'పవనసుత రైస్ మిల్లు' ప్రభుత్వ మిల్లింగ్ ధాన్యం అక్రమాల వ్యవహారంలో కీలక పాత్రధారుల తీగ లాగితే డొంకంతా కదిలేలా ఉందని స్థానిక నాయకుడు సముద్రాల రమేష్ ఆరోపించారు. సూరయ్యపల్లి గ్రామంలో ఉన్న 'శ్రీలక్ష్మి మిల్లు' యాజమాన్యం మరియు వొల్లాల సత్యనారాయణ ఈ మొత్తం కుంభకోణంలో ప్రధాన 'కర్త, కర్మ, క్రియా'గా వ్యవహరించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష నిర్వహించిన విచారణలో పవనసుత రైస్ మిల్లుకు సంబంధించి ప్రభుత్వానికి అందాల్సిన రూ. 12.28 కోట్ల విలువైన 2,821 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి పడినట్లు తేలింది. పవనసుత మిల్లుకు కేటాయించిన ఈ ధాన్యాన్ని మంథనిలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మిల్లుకు అక్రమంగా తరలించినట్లు ప్రాథమిక విచారణ, రవాణా చిట్టీలు మరియు ఉమ్మడి సంతకాల ఆధారంగా స్పష్టమైంది. దీని ఆధారంగా పవనసుత మిల్లు భాగస్వామి రవికంటి పవన్ కుమార్ తో పాటు శ్రీలక్ష్మి మిల్లు భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై ఇప్పటికే చట్టపరమైన కేసులు నమోదు చేశారు. అయితే ఈ కుంభకోణం కేవలం పైన కనిపించే వ్యక్తులతోనే ముగిసిపోలేదని, దీని వెనుక వొల్లాల సత్యనారాయణ ముఖ్య భూమిక ఉందని సముద్రాల రమేష్ పేర్కొన్నారు. ఈ భారీ ప్రజాధనం దుర్వినియోగంపై వెంటనే విజిలెన్స్ అధికారులు మరియు కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రంగాంలోకి దిగి లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. అక్రమ మార్గంలో మళ్లించిన ధాన్యం, దానికి సంబంధించిన నిధుల కదలికలను తేల్చేందుకు శ్రీలక్ష్మి మిల్లు మరియు సంబంధిత వ్యక్తుల అన్ని రకాల బ్యాంకు ఖాతాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అప్పుడే అసలు సూత్రధారుల భాగోతం బయటపడుతుందని తెలిపారు. అపరాధ రుసుముతో కలిపి రూ. 12.28 కోట్లకు చేరిన ప్రభుత్వ సొమ్మును బాధ్యుల నుంచి ఒక రూపాయి కూడా వదలకుండా తక్షణమే రికవరీ చేయాలని, ధాన్యాన్ని పక్కదారి పట్టించిన వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ ధాన్యం విషయంలో అక్రమాలకు పాల్పడే వారిపై ఎంతటి ఒత్తిళ్లు వచ్చినా ఉపేక్షించబోమని పాలనా యంత్రాంగం స్పష్టం చేస్తున్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని మంథని ప్రజలు కోరుతున్నారు.

## పాట్నాపూర్‌లో పూలాజీబాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గం పాట్నాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీబాబా మఠంలో జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎంపీ నగేష్, ఐటీడీఏ పీవో మకరందం, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీర్ శ్యాంనాయక్ తదితరులు హాజరై నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



## నార్లపూర్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- 40 వాహనాల తనిఖీ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ నార్లపూర్‌లో ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు వాంకిడి పోలీస్ స్టేషన్ సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో ముఖాముఖిగా మాట్లాడి స్థానిక సమస్యలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు.సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ నంబర్లను ఎవరికీ చెప్పవద్దని పోలీసులు సూచించారు. గుడుంబా, అక్రమ మద్యం వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, విద్య, ఉపాధి వైపు దృష్టి సారించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలియజేశారు.కార్యక్రమంలో భాగంగా 40 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి, పత్రాలు లేని వాహనదారులపై జరిమానాలు విధించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు లేదా 112కు సమాచారం అందించాలని, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అవసరమని పోలీసులు కోరారు.




## మంథని ఆర్టీసీ నిర్లక్ష్యం.. ప్రయాణికుల నరకయాతన!

- పావుగంటకో బస్సు వేయకపోతే బస్టాండ్ ముట్టడిస్తాం
- ఎక్స్‌ప్రెస్ల పేరిట నడిరోడ్డుపై దింపేస్తే సహించేది లేదు!
- అధిక ఛార్జీల దోపిడీ ఆపాలి.. వెంటనే బస్సులు పెంచాలి!
- ప్రజా సంఘాల డిమాండ్

**ప్రజా వాయిస్ మంథని** మంథని బస్సు డిపో పరిధిలో సరైన సమయంలో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా మంథని డిపోలో బస్సుల సంఖ్యను పెంచకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఫలితంగా బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి చూడాల్సి వస్తోందని వృద్ధులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మంథని నుండి కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి రూట్లలో తీవ్ర రద్దీ ఉంటుందని, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ప్రతి పావుగంటకు ఒక ఆర్డినరీ బస్సును అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అంతేకాకుండా, ఆర్డినరీ బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి అధిక ఛార్జీలు వసూలు చేయడమే కాకుండా, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కిన సామాన్యులను, మహిళలను, వృద్ధులను నిర్దాక్షిణ్యంగా మార్గం మధ్యలోనే దింపేసే పద్ధతిని వెంటనే మానుకోవాలని స్పష్టం చేస్తున్నారు. రాబోయే పండుగలు, ఆదివారాలు మరియు సోమవారాల వంటి తీవ్ర రద్దీ ఉండే రోజుల్లో ముందస్తుగా ప్రత్యేక సర్వీసులను నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మంథని డిపోలో బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని, లేని పక్షంలో బస్టాండ్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రయాణికులు, స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## జిల్లా ప్రజలను వణికిస్తున్న వీధి కుక్కలు, కోతులు

- మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో బెంబేలెత్తుతున్న జనం
- చిన్నారులు, వృద్ధులే లక్ష్యంగా దాడులు
- ప్రాణాలు గుప్పిట్లో పట్టుకుని నిత్యం భయం భయం
- కథనాలు వస్తున్నా మారని తీరు
- శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి
- తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ప్రజల విన్నపం





**ప్రజా వాయిస్ పెద్దపల్లి** పెద్దపల్లి జిల్లా పరిధిలోని ప్రజలు తీవ్రమైన భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం మూడూ నియోజకవర్గాల పరిధిలో వీధి కుక్కలు, కోతుల స్వైరవిహారం అట్టడుగు స్థాయికి చేరింది. ఎన్నడూ లేని విధంగా ఇటు వీధి కుక్కల దాడులు, అటు కోతుల భయం పెరిగిపోవడంతో ఉదయం ఇల్లు దాటాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు.వృద్ధులు, చిన్నారులపైనే ప్రతాపంవీధి దాటి బయటకు వచ్చే చిన్నారులు, నడకకు వెళ్లే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఈ మూగజీవాలు విరుచుకుపడుతున్నాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న పసిపిల్లలపై కుక్కలు గుంపులుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు రోజూ ఏదో ఒక నియోజకవర్గంలో వెలుగుచూస్తూనే ఉన్నాయి. మరోవైపు గ్రామాల్లో, పట్టణాల్లో కోతుల మూకలు ఇళ్లపైకి దండెత్తి గృహిణులను, పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆసుపత్రుల పాలవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

**వార్తలొస్తున్నా కదలని యంత్రాంగం**

ఈ తీవ్రమైన సమస్యపై పత్రికల్లో, మీడియాలో ఎన్నో కథనాలు వచ్చినా అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే తప్ప, ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం చూపని వ్యవస్థలో బతుకుతున్నామని స్థానికులు తీవ్ర వేదన చెందుతున్నారు. పెంపుడు జంతువుల సంఖ్యను నియంత్రించడంలో గానీ, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం, రేబీస్ నిరోధక టీకాలు వేయడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**శాశ్వత పరిష్కారం చూపాలంటూ డిమాండ్**

ఇప్పటికైనా ఈ సమస్యను తేలిగ్గా తీసుకోకుండా, భవిష్యత్తులో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గారు తక్షణమే జోక్యం చేసుకుని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, మున్సిపాలిటీలు మరియు గ్రామ పంచాయతీ అధికారులను పరుగులు పెట్టించి సమస్యకు శాశ్వత విముక్తి కల్పించాలని మూడూ నియోజకవర్గాల ప్రజలు వేడుకుంటున్నారు.

# ముత్తారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ముత్తారం - గట్ల నర్సింగాపూర్ - లంబాడీ తండా రహదారి అభివృద్ధికి రూ.3.74 కోట్లు
- గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.ముత్తారం చౌరస్తా నుంచి గట్ల నర్సింగాపూర్ మీదుగా లంబాడీ తండా వరకు రూ.3.74 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చేరుకున్న మంత్రి ముందుగా రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.అనంతరం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ప్రజా పాలనలో ముత్తారం గ్రామానికి అందిన సంక్షేమ ఫలాలు

ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముత్తారం గ్రామంలో 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలా వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగనుంది. 153 పెన్షన్లకు రూ.41.57 లక్షలు విడుదల చేస్తున్నారు.గృహజ్యోతి పథకం ద్వారా 271 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.45.43 లక్షల ప్రయోజనం కల్పించారు.మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 191 కుటుంబాలకు రూ.1.60 లక్షలు విడుదల చేశారు. 28 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.1.60 లక్షలు అందించారు. 12 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.17 కోట్లు విడుదల చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, ఒక్కో కిట్‌లో 13 రకాల వస్తువులు అందించారు. హోటళ్లకు సైతం స్టీల్ గ్లాసులు అందించారు. 158 మంది రైతులకు రూ.1.35 కోట్ల రైతు రుణమాఫీ ప్రయోజనం కల్పించారు. 430 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.2.18 కోట్లు అందించారు. రైతు బీమా కింద మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందించారు. నలుగురు రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.79,600 అందించారు.13 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు. 63 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.గ్రామంలోని 422 రేషన్ కార్డులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు.గ్రామ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షల పనులు పూర్తి చేశారు. అంగన్వాడీకి తాగునీటి సౌకర్యం కోసం రూ.1 లక్షతో అభివృద్ధి పనులు చేపట్టారు.గ్రామ ప్రజలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.భూభారతి కార్యక్రమంలో భీమదేవరపల్లి అనంతరం ముత్తారం గ్రామంలో భూసర్వే చేపట్టనున్నారు.

### ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, జల సిరి పథకం కింద ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షలు అందిస్తుందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

### ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలి

ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను వినియోగించాలని మంత్రి సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



### కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

14–15 సంవత్సరాల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందించే టీకాను వేయించాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని, ముత్తారం ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్ వేయిస్తామని హామీ ఇచ్చారు.

### యువత క్రీడల్లో రాణించాలి

యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపు రావడంతో పాటు, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో క్రీడా సామగ్రి అందించామని చెప్పారు. ముత్తారం గ్రామానికి క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రితో పాటు ఓపెన్ జిమ్ అందించినట్లు తెలిపారు.ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

### మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించి వారు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలు తమ ఆర్థిక కార్యకలాపాలను పెంచుకునేలా రుణ పరిమితులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని చెప్పారు.ముత్తారం గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి స్థల సేకరణపై తీర్మానం చేసి ఇవ్వాలని, వెంటనే వీవో భవనం మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### సౌర విద్యుత్ ను ప్రోత్సహించాలి

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ పవర్ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్ల వరకు రూ.78 వేల సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందన్నారు.

### ఓటు హక్కును కాపాడుకోవాలి

ఎస్ఐఆర్ నో మ్యాపింగ్‌లో భాగంగా ముత్తారం గ్రామానికి చెందిన 22 మంది ఓటర్లకు నోటీసులు అందినట్లు మంత్రి తెలిపారు. సంబంధిత ఓటర్లు సరైన వివరాలను బీఎల్ఓలకు అందించి తమ ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### ముత్తారం గ్రామానికి చారిత్రక గుర్తింపు

ముత్తారం గ్రామానికి కాకతీయుల కాలం నుంచే ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామంలోని త్రికూటేశ్వరాలయం చారిత్రక ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ముత్తారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి పనులను మంత్రి సహకారంతో ముందుకు తీసుకెళ్తామని గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు బతకలేని చోట...మనిషి ఎలా బతుకుతాడు?

- బండరాయిని సైతం చీల్చే బోధివృక్షం
- ప్లాస్టిక్ వ్యర్థాల కోరల్లో ఓడిపోయింది
- పర్యావరణ విధ్వంసానికి మౌన సాక్ష్యంగా మోడుబోయిన రాగిచెట్టు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగష్టు 30** బండరాయిని చీల్చుకుని మొలిచే శక్తి, ప్రతికూల పరిస్థితుల్లోనూ మనుగడ సాగించే సహజ లక్షణం బోధివృక్షానికి (రాగిచెట్టుకు) ప్రకృతి ప్రసాదించిన ప్రత్యేకత. కానీ పైచిత్రంలో కనిపిస్తున్న ఓ రాగిచెట్టు పరిస్థితి మాత్రం ప్రకృతికే కన్నీళ్లు తెప్పించేలా ఉంది. చుట్టూ పేరుకుపోయిన టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పలు, దుర్వాసన, కాలుష్యం మధ్య ఆ చెట్టు ఆకులు రాల్చి బోసిపోయి కనిపిస్తోంది. సాధారణంగా ఎలాంటి నేలలోనైనా మొలకెత్తి పెరిగే రాగిచెట్టు.. చెత్త కుప్పల మధ్య మాత్రం తన ఉనికినే కోల్పోతున్నట్టుగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు పచ్చని ఆకులతో కళకళలాడాల్సిన ఈ చెట్టు.. ప్రస్తుతం కొమ్మలు మాత్రమే మిగిలి, డంపింగ్ యార్డు దుస్థితికి మౌన సాక్ష్యంగా నిలిచింది.

### చెట్టు చెబుతున్న చేదు నిజం..

రాగిచెట్టు సాధారణంగా ప్రతికూల పరిస్థితులను తట్టుకుని పెరిగే మొక్కగా భావిస్తాం. అలాంటి చెట్టే చెత్త, ప్లాస్టిక్, కాలుష్యం మధ్య ఎదగలేక ఆకులు రాల్చడం.. మనిషి సృష్టిస్తున్న పర్యావరణ సంక్షోభానికి ప్రతీకగా నిలుస్తోంది.

### అభివృద్ధి పేరుతో.. ప్రకృతికి అన్యాయం

పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే చెత్త సేకరణ మాత్రమే కాదు.. దాని శాస్త్రీయ నిర్వహణ కూడా అత్యవసరం. తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు తరలించడం, తడి వ్యర్థాలతో కంపోస్టు తయారు చేయడం వంటి చర్యలు సమర్థంగా అమలు కావాల్సి ఉంది. కానీ డంపింగ్ యార్డు దృశ్యం మాత్రం ఆ లక్ష్యాలకు భిన్నమైన వాస్తవాన్ని చూపుతోంది. మనం పారేసిన ఒక్కో ప్లాస్టిక్ కవర్.. చివరకు ప్రకృతిపై పడే భారంగా మారుతోంది.

### మౌనంగా ప్రశ్నిస్తున్న (బోధివృక్షం) రాగిచెట్టు

బండరాయిని చీల్చుకుని నేను బతకగలిగాను. కానీ మీ ప్లాస్టిక్ మధ్య ఎందుకు బతకలేక పోతున్నాను? అంటూ ఆ బోసిపోయిన రాగిచెట్టు సమాజాన్ని ప్రశ్నిస్తున్నట్టుగా ఉంది. ఇది కేవలం ఓ చెట్టు పరిస్థితి కాదు.. మనిషి పర్యావరణంపై చూపుతున్న నిర్లక్ష్యానికి కనిపిస్తున్న ప్రతిబింబం. చెత్త కుప్పల మధ్య బోసిపోయిన ఆ రాగిచెట్టు.. భవిష్యత్ తరాలకు మనం వదిలిపెడుతున్న పర్యావరణ పరిస్థితిపై హెచ్చరికలా నిలుస్తోంది. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనిషిదే. లేకపోతే..రేపు చెట్లు మాత్రమే కాదు, మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకమే.







# మల్లన్న గుట్టపై బోనాల భక్తి పారవశ్యం.!

- కిస్మత్ పూర్ లో ఘనంగా భ్రమరాంబ సమేత మల్లన్న స్వామి,ఎల్లమ్మ అమ్మవార్ల ఉత్సవాలు
- శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ వైభవంగా తొట్టెల ఊరేగింపు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నర్కూడ నర్సింగ్ యాదవ్ బోనం
- హాజరైన ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**నియోజకవర్గ పరిధిలోని 122 డివిజన్ కిస్మత్‌పూర్‌లో స్వయంభువు వెలసిన శ్రీమల్లన్న గుట్టపై బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో,వైభవంగా జరిగాయి.కిస్మత్‌పూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో తరతరాలుగా వస్తున్న ఆనవాయితీని పురస్కరించుకుని ఈ వేడుకలను అత్యంత అట్టహాసంగా నిర్వహించారు.శ్రీశ్రీ మల్లన్న స్వామితో పాటు శ్రీశ్రీ ఎల్లమ్మ అమ్మవారికి స్థానిక మహిళలు భక్తిశ్రద్ధలతో నైవేద్యంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఉదయాన్నే మంగళవాయిద్యాల మోతలు,శివసత్తుల పూనకాలు,పోతురాజుల విన్యాసాల నడుమ కిస్మత్‌పూర్ పురవీధుల్లో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు ఊరంతటికీ పండుగ శోభను తెచ్చి పెట్టింది.గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయం వరకు తొట్టెలను తీసుకెళ్లారు.ఈ వేడుకల్లో నర్కూడ గ్రామానికి చెందిన నర్సింగ్ యాదవ్ బోనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పసిడి కాంతులీనే అలంకరణలతో వచ్చిన ఈ బోనాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించి దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులుఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో పలువురు రాజకీయ ప్రముఖులు, పూర్వ ప్రజాప్రతినిధులు పాల్గొని మల్లన్న స్వామి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్,మాజీ సర్పంచ్ భీమార్జున్ రెడ్డి,మాజీ ఎంపీపీ సత్యనారాయణ యాదవ్,పలువురు మాజీ కార్పొరేటర్లు మల్లన్న స్వామి,ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు.దర్శనానంతరం భక్తులందరికీ కమిటీ సభ్యులు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో యాదవ సంఘం అధ్యక్షుడు దశరథ్ యాదవ్,ఉపాధ్యక్షుడుముత్యాలు యాదవ్, బండారి రమేష్ యాదవ్, బండారి మల్లేష్ యాదవ్, దాసరి నరేష్ యాదవ్, బండారి సురేష్ యాదవ్, దేవేందర్ యాదవ్,వేణు యాదవ్,గణేష్ యాదవ్‌లతో పాటు యాదవ సంఘం కమిటీ సభ్యులు,యువత కీలక పాత్ర పోషించారు.




# క్రీడా సందడికి సుల్తానాబాద్ సిద్ధం

- సెప్టెంబరు 1 నుంచి మండల స్థాయి ఎస్ జీఎఫ్ పోటీలు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** క్రీడా ప్రతిభకు పదును పెట్టేందుకు సుల్తానాబాద్ మండలం వేదిక కానుంది. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలకు సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఆతిథ్యమివ్వనుంది. సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో మూడు రోజులపాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్ తెలిపారు.సెప్టెంబరు 1న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 2న బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. చివరి రోజు సెప్టెంబరు 3న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఎలిజిబిలిటీ ఫారంతో ఉదయం 9 గంటలకు ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో రిపోర్టు చేయాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్ సూచించారు. నిర్ణీత సమయానికి క్రీడాకారులు హాజరై పోటీల్లో పాల్గొనాలని కోరారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# డాక్టర్ లేకుండానే కంటి వైద్యం..?



- మిర్యాలగూడలో ప్రైవేట్ ఆసుపత్రిపై తీవ్ర ఆరోపణలు
- అర్హతలు లేని వ్యక్తుల చేతుల్లో రోగుల ప్రాణాలా..?
- వైద్య పరీక్షలు, ఆపరేషన్లపై ఆరోపణలు
- ఓపీ చీటి లేకుండానే చికిత్స..?
- ఒక్కో పేషెంట్ నుంచి రూ.300 ఫీజు వసూలు చేస్తున్నారంటూ విమర్శలు
- గతంలో తనిఖీలు, కేసులు, చర్యలు జరిగినా మళ్లీ కొనసాగుతోందా వైద్య వ్యాపారం..?
- జిల్లా వైద్యాధికారుల హెచ్చరికలు బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు
- ప్రజల కంటి చూపు, ప్రాణాలతో చెలగాటమా..?
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ** మిర్యాలగూడ పట్టణంలో ఓ ప్రైవేట్ కంటి ఆసుపత్రి నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత కలిగిన కంటి వైద్యుడు ఆసుపత్రిలో అందుబాటులో లేకుండానే, ప్రైవేట్ వ్యక్తి ఆసుపత్రిని నిర్వహిస్తూ రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారని, అనుభవం, తగిన అర్హతలపై అనుమానాలు ఉన్నప్పటికీ కంటి చికిత్సలు, ఆపరేషన్ల వరకు వ్యవహారం సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ అంశం మిర్యాలగూడలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన ఓపీ చీటి ఇవ్వకుండా, ఫీజు పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన పరీక్షలు, సూచించిన మందులు, చికిత్స వివరాలకు సంబంధించిన సరైన రికార్డులు అందిస్తున్నారా లేదా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కంటి వైద్యం అత్యంత సున్నితమైన అంశం కావడంతో, అర్హత లేని వ్యక్తులు పరీక్షలు నిర్వహిస్తే రోగుల కంటి చూపుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే మిర్యాలగూడలో ప్రైవేట్ కంటి ఆసుపత్రులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన తనిఖీల్లో తీవ్ర అవకతవకలు వెలుగుచూశాయి. అర్హత కలిగిన కంటి వైద్యులు లేకుండానే టెక్నీషియన్లు పరీక్షలు, మందుల సూచనలు, కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్సలకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వస్తున్న ఆరోపణలపైనా అధికారులు వెంటనే స్పందించి నిజానిజాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.సదరు ఆసుపత్రి నిర్వాహకుడిపై గతంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారని, తనిఖీల సందర్భంగా కేసులు కూడా నమోదైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి నిర్వహణను నిలిపివేయాలని గతంలో పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, నిబంధనలను ఉల్లంఘిస్తూ కార్యకలాపాలు కొనసాగుతున్నాయా అనే కోణంలో అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.అసలు ఆసుపత్రిలో చికిత్స చేస్తున్న వ్యక్తికి ఎలాంటి వైద్య అర్హతలు ఉన్నాయి? ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సక్రమంగా ఉందా? పేరుమీద ఉన్న డాక్టర్ వాస్తవంగా రోగులకు సేవలందిస్తున్నారా? వైద్య పరీక్షలు, ఆపరేషన్లు ఎవరి పర్యవేక్షణలో జరుగుతున్నాయి? రోగులకు ఓపీ చీటీలు, చికిత్స రికార్డులు ఎందుకు ఇవ్వడం లేదనే ఆరోపణల్లో నిజమెంత? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.గతంలో మిర్యాలగూడలో జరిగిన తనిఖీల్లో అర్హత లేని వ్యక్తులు కంటి వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలపై కేసులు నమోదై, పలువురిపై చర్యలు తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అందువల్ల ఇప్పుడు వస్తున్న ఆరోపణలను కూడా తేలిగ్గా తీసుకోకుండా జిల్లా వైద్యాధికారి, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల ప్రాణాలు, కంటి చూపుతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి అనుమతులు, వైద్యుల అర్హతలు, రోగుల రికార్డులు, నిర్వహిస్తున్న చికిత్సలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.



# వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలన్నావ్

- వెయ్యి రోజులు కావస్తున్నా హామీలు ఏమైనై రేవంత్?
- తీవ్ర విమర్శలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

**ప్రజా వాయిస్,మోత్కూరు,(ఆగస్టు 30):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడు రోజుల్లో వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ తుంగతుర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కెసిఆర్,కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వరుస నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో చేపట్టనున్న కార్యక్రమాలపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 2న తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో వేలాది మందితో నిరసన ర్యాలీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను, వాటి అమలు తీరును వివరిస్తూ ఫ్లెక్సీలతో ర్యాలీ కృష్ణా జలాల అంశంపై సెప్టెంబర్ 3న మిర్యాలగూడ వేదికగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాల వినియోగం విషయంలో తెలంగాణ రైతుల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడటం లేదని,ఎడమ కాలువ పరిధిలోని రైతుల సమస్యలపై చేపట్టే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. 4న తిరుమలగిరిలో వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలపై సదస్సు నిర్వహిస్తామని ముఖ్యంగా వికలాంగులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. 5న కూడా నిరసన కార్యక్రమాలు, 6న గ్రామశాఖల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల ఎదుట నిరసన కార్యక్రమాలు,గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు తదితర మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, 7న అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు కిషోర్ కుమార్ తెలిపారు. 7నమోత్కూర్‌లో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు. 8న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలపై సమావేశం నిర్వహించి, అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తామని,. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, విద్యుత్, ఎరువుల సరఫరా, పంటల కొనుగోలు వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. రైతుబీమాకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సాయం అందడం లేదన్నారు.22ఏ భూముల సమస్యపై తీవ్ర ఆరోపణలు రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యను ప్రభుత్వం తీవ్రంగా జఠిలం చేసిందని కిషోర్ కుమార్ ఆరోపించారు. ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు, నిర్మించుకున్న ఇళ్లు కూడా 22ఏ జాబితాలోకి చేరడంతో సామాన్యులు తమ ఆస్తులను విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మోత్కూర్‌తో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ ఈ సమస్య తీవ్రంగా ఉందని,22ఏ జాబితాలో భూములను చేర్చిన విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, మూసీ ప్రక్షాళన, హైడ్రా, భూముల వ్యవహారాలను ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,భూ సమస్యలను పరిష్కరించేందుకు పారదర్శక విధానం అవలంబించాలని కోరారు.జీవో97పై విద్యారంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జీవో 97ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థుల ఉన్నత విద్యావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని. రైస్ మిల్లర్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం కూడా ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. మిల్లింగ్ లోటుపాట్లను నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సి ఉండగా భారీ మొత్తాల్లో చెల్లింపులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని,సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోత్కూర్, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో జరుగుతున్న పరిణామాలపైనా కిషోర్ కుమార్ స్పందించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతం మంజూరైన నిధులు ఏ విధంగా వినియోగిస్తున్నారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల పాలన, అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని కోరారు.రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, ఎరువుల సరఫరా వంటి రంగాలు సంక్షోభంలో ఉన్నాయని,రైతులు పంటలు పండించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని,గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ,ప్రభుత్వం తన రాజకీయ అంతర్గత వ్యవహారాల కంటే ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడం కంటే ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు, ప్రస్తుత పాలనలో ఎదురవుతున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాల ఉద్దేశమని తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ పత్రిక సమావేశంలో రాష్ట నాయకులు, అన్ని మండలాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 22ఏ సమస్య పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడి

- హరీశ్ రావు
- వారం రోజుల్లో 22ఏ సమస్య పరిష్కరించాలి
- పటాన్ చెరులో 50 వేల ఎకరాలు, లక్ష ఇళ్లు నిషేధిత జాబితాలో సామాన్యుల ఆస్తులను వెంటనే 22ఏ నుంచి తొలగించాలి
- పరిష్కారం కాకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి





**పటాన్‌చెరు ప్రజావాయిస్** పటాన్‌చెరు నియోజకవర్గంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఇళ్ల సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన 22ఏ భూముల బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. బాధితులు తమ సమస్యలను హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, బ్యాంకు రుణాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి, విద్యుత్, నీటి కనెక్షన్లు కల్పించి, ఆస్తి పన్నులు వసూలు చేసిన తర్వాత ఇప్పుడు 22ఏ పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. ఒక్క పటాన్‌చెరు నియోజకవర్గంలోనే దాదాపు లక్ష ఇళ్లు, 50 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. గుమ్మడిదల, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, జిన్నారం ప్రాంతాల్లో కలిపి 50,565 ఎకరాలు జాబితాలో ఉన్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు జీవితకాలం కష్టపడి సంపాదించిన ఆస్తులను 22ఏలో చేర్చి మానసికంగా వేధించడం దుర్మార్గమని విమర్శించారు. రైతులు, ఇళ్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆస్తులు కూడా 22ఏ జాబితాలో ఉన్నాయని తాను ప్రస్తావించిన తర్వాత వాటిని ఎలా తొలగించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎలాంటి దరఖాస్తు లేకుండా ఆస్తులు తొలగిస్తే సామాన్యుల ఆస్తులను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. 22ఏ సమస్యను 98 శాతం పరిష్కరించామని మంత్రి చెబుతున్నారని, మరి పటాన్‌చెరువులో ఇంత పెద్ద మొత్తంలో భూములు, ఇళ్లు ఎందుకు జాబితాలో ఉన్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తప్పులను సరిదిద్ది బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జీవో 58, 59 కింద పేదలకు పట్టాలు ఇచ్చామని గుర్తుచేశారు. అమీన్‌పూర్ ప్రాంతానికి తాగునీరు, విద్యాసంస్థలు, వైద్య సదుపాయాలు కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూముల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పటాన్‌చెరు ప్రజల తరపున సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వారం రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రకటించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఇళ్లను పరిశీలించి అర్హత ఉన్న వాటిని వెంటనే తొలగించాలని కోరారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే బాధిత రైతులు, ఇళ్ల యజమానులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్ వద్ద వంటావార్పు నిర్వహించి, సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడే బైఠాయిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మోమిన్ పేట్ మండలం లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**ప్రజా వాయిస్/మోమిన్ పేట్** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మోమిన్ పేట్ మండలంలోని కేసారం,సయ్యద్ అలీపూర్,కాస్లాబాద్ , కాస్లాబాద్ తండా గ్రామాలలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి ,మండల అధ్యక్షులు శంకర్ యాదవ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కోస్గి సురేందర్ కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి వారికి నూతన వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు . నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ క్రమంలో..సయ్యద్ అలీపూర్ సర్పంచ్ ఉద్దాల లలిత జైపాల్, ఎన్కేపల్లి ఉప సర్పంచ్ అబ్దుల్ మనన్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సుభాష్ ,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరాల సిరాజుద్దీన్, చంద్రయ్య,లాయక్ అలీ మానేయ్య నర్సింలు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కూలీపై పడిన కౌన్సిలర్ దౌర్జన్యం..

# 'మానవ హక్కుల కమిషన్' సీరియస్!

- పొలంలో పనిచేస్తుండగా భౌతిక దాడికి దిగి 'చంపేస్తా'మని బెదిరించిన కౌన్సిలర్ పి. రాజేందర్
- స్థానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో కమిషన్ ను ఆశ్రయించిన బాధితుడు అనసూరి సతీష్
- విచారణ జరిపి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి డీసీపీకి హెచ్ ఆర్ సి స్పష్టమైన ఆదేశాలు!

**ప్రజా వాయిస్ మంథని**పెద్దపల్లి జిల్లా మంథని మండలం నగరం గ్రామానికి చెందిన అనసూరి సతీష్ (తండ్రి: నాగయ్య) అనే వ్యవసాయ కూలీ ఆగస్టు 16, 2026న తన సహచరుడితో కలిసి మంథని పట్టణంలోని అయ్యగారి చెరువు సమీపంలో ఉన్న పొలంలో కూలీ పనులకు వెళ్లాడు. ఆ సమయంలో మంథని పురపాలక సంఘానికి చెందిన పదో వార్డు కౌన్సిలర్ పి. రాజేందర్ అక్కడికి చేరుకుని, ఇక్కడ పనులకు ఎందుకు వచ్చారంటూ తీవ్ర పదజాలంతో బూతులు తిడుతూ దౌర్జన్యానికి దిగాడు. బాధితుడిపై భౌతిక దాడికి పాల్పడటమే కాకుండా, ఇకపై ఇటువైపు వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రాణాలతో తీస్తానని బహిరంగంగా బెదిరింపులకు గురిచేశాడు.

## పోలీసుల నిర్లక్ష్యం.. కమిషన్ మెట్లెక్కిన బాధితుడు!


బాధితుడు అనసూరి సతీష్ ఈ దాడి ఘటనపై తక్షణమే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రజాప్రతినిధి ఒత్తిళ్లతో పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకుండా కాలయాపన చేశారు. న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన బాధితుడు చివరికి హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను తపాలా (పోస్ట్) ద్వారా ఆశ్రయించి తన బాధను విన్నవించుకున్నాడు.

## డీసీపీకి ఉత్తర్వులు జారీ

బాధితుడు పంపిన ఫిర్యాదును (కేసు సంఖ్య 3420/2026) స్వీకరించిన హెచ్‌ఆర్‌సి ఛైర్‌పర్సన్ గౌరవ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఆగస్టు 20, 2026న సమగ్ర విచారణ జరిపారు. 1993 మానవ హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 18 ప్రకారం కమిషన్‌కు ఉన్న అధికారాలతో ఉత్తర్వులు వెలువరించారు. బాధితుడి ఆవేదనను ప్రత్యక్షంగా పరిశీలించి, సదరు కౌన్సిలర్‌పై చట్టప్రకారం తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)ని ఆదేశించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



**జిన్నారం: ప్రజావాయిస్** పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో జిన్నారం పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. నూతన దేవాలయాల నిర్మాణం,మౌలిక వసతుల కల్పనకు సొంత నిధులతో సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదర భావాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని అన్నారు.జిన్నారం ప్రాంత ప్రజల భక్తి విశ్వాసాలకు అనుగుణంగా శ్రీ పోచమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం తనవంతుగా రూ.12 లక్షల భారీ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో జిన్నారం ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తుల కోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, బొంతపల్లి గుడి చైర్మన్ ప్రతాపరెడ్డి, గడ్డపోతారం మాజీ సర్పంచ్ ప్రకాష్ చారి, అంతి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేష్, కొల్లూరి నర్సింహా, మల్లారెడ్డి, వివిధ మున్సిపాలిటీల కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లగూడెం మహిళల కన్నీటి గాధా

# ఐకేపీ నిధుల గోల్ మాల్ పై తెలని తీర్పు ..??

- ఐకేపీ నిధులలో గోల్ మాల్ ..!!
- రూ.5.20 లక్షలు దుర్వినియోగం
- విచారణ పేరుతో అధికారులు డ్రామా...?

**ప్రజా వాయిస్ టేక్మాల్ :** పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని టేక్మాల్ మండల ఐకేపీ శాఖలోని కొందరు సిబ్బంది తూట్లు పొడుస్తున్నారు. అమాయక మహిళల కష్టార్జితాన్ని దోచుకుంటున్న వైనం మెదక్ జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో మహిళా సంఘాల నిధుల దుర్వినియోగం రోజు రోజుకూ కొత్త కోణాలను ఆవిష్కరిస్తోంది. మొదట రూ.18 లక్షల శ్రీనిధి నిధులగోల్ మాల్ బయటపడగా, తాజా విచారణలో మరో రూ.5,20,395 కుంభకోణం వెలుగుచూడటంతో గ్రామస్తులు భగ్గుమంటున్నారు.

## నిరక్షరాస్యులే టార్గెట్.. దోపిడీ ఎలా జరిగింది?

గొల్లగూడెం మహిళలు ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో వారి బలహీనతను కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సిఏ ) ఎల్లంపల్లి అంజనేయులు ఆసరాగా చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రూప్ సభ్యులకు తెలియకుండానే తప్పుడు తీర్మానాలు సృష్టించి, కొందరితో బలవంతంగా సంతకాలు పెట్టించుకుని ఒక్కో గ్రూపుపై భారీగా నిధులు కాజేశారని బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు.దీంతో గ్రామ మహిళలు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించడంతో శ్రీనిధి జిల్లా అధికారి గంగారం ఆధ్వర్యంలో విచారణ జరిగింది. అవినీతి జరిగిందని తేలినా, కొంత డబ్బు కట్టించడంతోనే సరిపెట్టారని, విచారణ తూతూ మంత్రంగా జరిగిందని గ్రామస్తులు మండిపడ్డారు.దీంతో మళ్లీ జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించగా మెదక్ జిల్లా కమ్యూనిటీ బేస్డ్ ఆడిటర్ నాగరాజు ఆధ్వర్యంలో మరోసారి విచారణ జరిగింది. ఈ విచారణలోనే మరో కుంభకోణం బట్టబయలైంది.

రూ.5.20 లక్షలు స్వాహా – లెక్కలతో సహా

– విజయలక్ష్మి పొదుపు సంఘం: రూ.50,000
– శిరీష పొదుపు సంఘం: రూ.50,000
– నల్ల పోచమ్మ సంఘం: రూ.1,95,000
– వీర హనుమాన్ పొదుపు సంఘం: రూ.67,500
– ఇతర రుణాలు కలిపి మొత్తం: రూ.5,20,395

## అధికారులపై అనుమానాలు..

తెరవెనుక ఎవరు?క్షేత్రస్థాయి సిబ్బందిని పర్యవేక్షించాల్సిన పై అధికారులు బాధ్యతను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇక్కడ సీసీ గా పనిచేసిన ఉద్యోగి అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ,సిఏ తో కుమ్మక్కై ఈ అక్రమాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.కేవలం కిందిస్థాయి సిబ్బందే కాకుండా ఈ అవినీతి వెనుక జిల్లాస్థాయి అధికారుల హస్తం కూడా ఉందని గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఒక్క గొల్లగూడెంలోనే రూ.23 లక్షలకు పైగా అవినీతి జరిగితే, ఎలకుర్తి, శేరిపల్లి, బర్దీపూర్, పల్వంచ, కోరంపల్లి, కాద్లూర్, శాబాద్ గ్రామాల్లో పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర విచారణ చేస్తే అవినీతి తీవ్రత ఊహిస్తేనే భయమేస్తోందని అంటున్నారు.

## ప్రజల ప్రశ్నలు - కలెక్టర్ గారు సమాధానం చెప్పాలి!

1. ఇప్పటివరకు జరిగిన విచారణ ఎంతవరకు వచ్చింది?2. దుర్వినియోగమైన మొత్తంలో ఎంత అమౌంట్ కట్టించారు? ఆ అమౌంట్ ఎవరు కడుతున్నారు?3. ఈ గ్రూపులపై ఏ లోన్ లేదని ఎన్ఓసి నోటీసు గ్రూప్ సభ్యులకు ఇచ్చారా?4. విచారణ జరుగుతుందా? లేక ముడుపులు ముట్టి తూతూ మంత్రంగా ముగిస్తున్నారా?మండలాన్ని విడిచిపెట్టకుండా ఏళ్ల తరబడి తమ రాజకీయ అండదండలతో సీసీ లుగా కొనసాగుతున్న వారిపైనే అనుమానాలు ఉన్నాయని, ఇంత ఫ్రాడ్ జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.జిల్లా కలెక్టర్ గారు వెంటనే జోక్యం చేసుకుని సిబిఐ తరహా లోతైన విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేయాలని గొల్లగూడెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కనకదుర్గ కాలనీ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతాం

## ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
కనకదుర్గ కాలనీలోని +ఔవీజ పార్కు, కమ్యూనిటీ సెంటర్‌ను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సందర్శించారు. పార్కులోని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పార్కుకు వచ్చిన వాకర్స్, స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు, వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, కనకదుర్గ కాలనీ పార్కును ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని +ఔవీజ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా..పిల్లలు ఆడుకునేందుకు పార్కులో ప్రత్యేక ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. చిన్నారుల వయసుకు అనుగుణంగా వివిధ ఆట పరికరాలను ఏర్పాటు



చేసి, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. కుటుంబాలతో కలిసి పార్కుకు వచ్చేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. అలాగే వరంగల్ చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా పార్కు గోడలపై కాకతీయ కళా వైభవం, చారిత్రక కట్టడాలు, సంస్కృతి ఉట్టిపడేలా ఆకర్షణీయమైన చిత్రాలు వేయించాలని సూచించారు. పార్కు అందాన్ని పెంచడంతో పాటు నగర చరిత్రను ప్రజలకు పరిచయం చేసేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, యువతకు ఉపయోగపడేలా మెడిటేషన్ కోసం ప్రత్యేక హాల్ ఏర్పాటు చేయాలని, ఓపెన్ జిమ్ పరికరాలను మెరుగుపరచాలని తెలిపారు. సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా లైటింగ్ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, పార్కు భద్రత కోసం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుపైనా దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. పార్కు అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని, అవసరమైతే తమవంతు సహకారం అందిస్తామని ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. కనకదుర్గ కాలనీ ప్రజలకు మరింత మెరుగైన పచ్చదనం, ఆరోగ్యం, వినోద సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పార్కును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత, Gwmc అడిషనల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, స్థానిక వాకర్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్ ఉద్యోగులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డిలో మద్యం తాగి పరీక్షకు వచ్చిన స్టూడెంట్

## గుర్తించి వెనక్కి పంపిన అధికారులు

నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 2,73,183 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,300 కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహించారు. ఇక తెలంగాణలో 17,627 మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగానూ 56 కేంద్రాల్లో నీట్ ప్రశాంతంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా శేరిగూడలో ఓ విద్యార్థి మద్యం తాగి పరీక్ష రాసేందుకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడిని సిబ్బంది గుర్తించి వెనక్కి పంపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థి కోసం గ్రీన్ ఛానల్ : గచ్చిబౌలి ట్రాఫిక్‌లో చిక్కుకున్న నీట్ పిజి విద్యార్థి వికాస్‌ను రాయదుర్గం పోలీసులు నిమిషాల్లో ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చారు. ఉదయం మారథాన్ రన్‌లో భాగంగా గచ్చిబౌలి – రాయదుర్గం మార్గంలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వికాస్? ట్రాఫిక్ చిక్కుకుపోవడంతో సైబరాబాద్ పోలీసులు ఆయన కోసం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. మారథాన్ ట్రాఫిక్‌ను దాటుకుంటూ రాయదుర్గం పోలీసులు గ్రీన్ ఛానెల్ ద్వారా వికాస్‌ను ఎగ్జామ్ సెంటర్ వద్దకు చేర్చారు. గచ్చిబౌలి – రాయదుర్గం మార్గంలో మారథాన్ రన్ ఉన్నందున ట్రాఫిక్ ఉంటుందని సైబరాబాద్ పోలీసులు ముందుగానే ఊహించారు. ఎవరైనా ట్రాఫిక్?లో చిక్కుకుపోతే కాల్ చేసేందుకు నెంబర్ కూడా ఏర్పాటు చేశారు.

మంథని జేఎన్టీయూలో నీట్ పీజీ పరీక్ష : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని మంథని జేఎన్టీయూ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంథని జేఎన్టీయూ కళాశాలలో 100 మంది విద్యార్థులకు గాను 98 మంది విద్యార్థులు మాత్రమే




పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను ఉదయం 7:30 నుంచి 8:45 వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, ఎంబీబీఎస్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, అడ్మిట్ కార్డును క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.?

## అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని,



సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

# 47వ డివిజన్‌లో అధ్వానంగా 'బృందావన్ గార్డెన్' దారి

- పర్మిషన్లకు లక్షల వసూలు..
- వసతుల కల్పనలో కార్పొరేషన్ శూన్యం
- కౌన్సిల్ వచ్చి నెలలు గడుస్తున్నా మారని మహర్దశ

**ప్రజా వాయిస్ గోదావరిఖని**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని పట్టణంలో 'అభివృద్ధి' అంటే కేవలం ప్రధాన రహదారులకు మాత్రమే పరిమితమైందా? అంతర్గత రహదారులను పట్టించుకునే నాథుడే లేదా? అని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
?గోదావరిఖనిలోని 47వ డివిజన్ పరిధిలోని మార్కండేయ కాలనీ, అడ్డగుంటపల్లి నుంచి శ్రీ శుభం హోటల్ మీదుగా బృందావన్ గార్డెన్‌కు వెళ్లే ప్రధాన అంతర్గత రహదారి తీవ్ర అధ్వానంగా తయారైంది. ఇక్కడ ఇళ్లు నిర్మించుకునే పౌరుల నుంచి కార్పొరేషన్ అధికారులు పర్మిషన్ల పేరుతో రెండు నుంచి మూడు



లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. కానీ, కనీస మౌలిక వసతులైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కౌన్సిల్ ఏర్పడి ఆరేడు నెలలు గడుస్తున్నా సందులలో ఒక్క రోడ్డు కూడా నిర్మించిన దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. కేవలం మెయిన్ రోడ్లు మెరిపిస్తేనే అభివృద్ధి అనిపించుకుంటుందా అని ప్రశ్నిస్తున్నారు. ఈ వర్షాకాలంలో సబ్-వే రహదారులన్నీ బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేకుండా తయారయ్యాయి. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, గౌరవ మేయర్ గారు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రధాన రహదారులకే కాకుండా అన్ని డివిజన్లలోని సబ్-వే రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పుట్టిన రోజు సందర్భంగా మేఘా రక్త దాన శిబిరం**
**బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు విద్యార్థులు ఎమ్మెల్యే అభిమానులు రక్తదాన శిబిరంలో పాల్గొనాలి**
**బిఆర్ఎస్ యువ నాయకులు జొల్లు నారాయణ**

**ప్రజా వాయిస్.. వనపర్తి**
వనపర్తి జిల్లావీపనగండ్ల మండల కేంద్రం లోని బస్టాండ్ ఆవరణలో ఉన్న తెలంగాణ స్తూపం దగ్గర సోమవారం కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను బి ఆర్ స్ మండల కమిటీ,మరియు వీపనగండ్ల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు, నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ యువ నాయకులు జొల్లు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా జొల్లు



నారాయణ మాట్లాడుతూ..మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా రక్త దానం శిబిరాన్ని ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు బిఆర్ఎస్ యువ నాయకులు జొల్లు నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసిన అనంతరం వేడుకల్లో పాల్గొనే బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు,యువకులు,హర్షన్న అభిమానులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు మీరు చేసే రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను నిలుపుతుందన్నారు అందుకు ప్రతి ఒక్కరు జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనాలని బిఆర్ఎస్ యువ నాయకులు నారాయణ కోరారు.

# భూపాలపల్లి కీర్తిని అంతర్జాతీయ వేదికపై చాటనున్న కావేరి జ్యోతి



**ప్రజా వాయిస్ పలిమెల**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలకు చెందిన కావేరి జ్యోతి ఏషియన్ త్రోబాల్ పోటీలకు భారత జట్టు తరఫున ఎంపికయ్యారు. ఇప్పటికే అంతర్జాతీయ పారా త్రోబాల్లో స్వర్ణం సాధించిన ఆమె, నవంబర్ 19 నుంచి 23 వరకు శ్రీలంకలోని నెగోంబోలో జరిగే ఏషియన్ ఛాంపియన్షిప్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా హన్మకొండలోని 'ఫిట్నెస్ జిమ్' నిర్వాహకులు కిరణ్, మనోజ్, విజయ్, సృజన్ ఆమెను ఘనంగా సన్మానించారు. రాబోయే పోటీల్లోనూ గెలిచి దేశానికి, పలిమెలకు మంచి పేరు తెస్తానని కావేరి జ్యోతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె ఎంపికపై గ్రామీణులు, అధ్యాపకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



# రైస్ మిల్ కార్మిక సంక్షేమ సంఘం ఏర్పాటు...

**- అధ్యక్షునిగా నీరటి శంకర్, ప్రధాన కార్యదర్శిగా వేగోళం శంకర్ గౌడ్.**

**- కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం**

**- లేబర్ కార్డులు, ఇన్సూరెన్స్ కోసం కృషి**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : రైస్ మిల్ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సుల్తానాబాద్ రైస్ మిల్ కార్మిక సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఐఎన్‌టీయూసీ నేషనల్ సెక్రటరీ బాబర్ సలీం పాషా ఆదేశాల మేరకు రైస్ మిల్ డ్రైవర్లు, గుమస్తాలు, హమాలీలు, మహిళా కార్మికులు, బజార్ హమాలీలు, ఐకేపీ హమాలీలు సమావేశమై సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్మికులకు లేబర్ కార్డులు, లేబర్ ఇన్సూరెన్స్ కల్పించేందుకు కృషి చేయడంతో పాటు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవడం సంఘం ప్రధాన ఉద్దేశమని కార్మిక సంఘం అధ్యక్షులు నీరటి శంకర్ తెలిపారు.

**కమిటీ ఎన్నిక :**

సంఘం అధ్యక్షుడిగా నీరటి శంకర్, ప్రధాన కార్యదర్శిగా వేగోళం శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కన్నం ఎల్లయ్య, చొప్పరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుగా సాయిరి మహేందర్, ముఖ్య సలహాదారుగా పురం హరికిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చొప్పరి వెంకటేష్, కార్యదర్శులుగా రెడ్డి ఐలయ్య, పోచవేని బాలకిషన్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైస్ మిల్ కార్మికులు, రైతులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.



## వర్ధన్నపేట పట్టణంలో సమస్య ఏదైనా సత్వరాగా పరిష్కరిస్తు ముందుకు సాగుతున్న మున్సిపల్ చైర్మెన్..

**జాఫర్‌గఢ్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్..**

**సమస్య దృష్టికి వస్తేనే కాదు సమస్యను తెలుసుకొని పరిష్కరించడం తమ లక్ష్యం అని తెలిపిన చైర్మెన్.**

**వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికై నిరంతర కృషి చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కు ప్రజల అభినందనలు..**

ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట):

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో మున్సిపల్ చైర్మన్ చేస్తున్న పనులకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జాఫర్‌గఢ్ ప్రధాన రహదారి ధ్వంసమై గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విషయం అటుగా వెళ్తున్న క్రమంలో గుర్తించి తక్షణమే మరమ్మతుకు చేపట్టారు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి. జేసీబీ సహాయంతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా రహదారిని సరిచేయించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు. అలాగే, రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అమృత్ 2.0 అధికారులతో మాట్లాడి, రహదారి ధ్వంసానికి గల కారణాలను పరిశీలించి శాశ్వత మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పాలకుర్తి సారంగపాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, 12వ వార్డు కౌన్సిలర్ తిరుపెల్లి వాణి - కుమారస్వామీ తదితరులు పాల్గొన్నారు...

## ఇన్చార్జ్ తహా సిల్దార్ గా ఆడేపు దివ్య జ్యోతి

ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహించిన తహసిల్దార్ సుజాత విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ అయ్యింది గతంలో బోయినపల్లి,వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, భూ సేకరణ విభాగంలో సైతం డిప్యూటీ తహశీల్దార్ గా పని చేసిన ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ స్థానంలో ఆర్డీవో ఆఫీస్ లో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నటువంటి దివ్యజ్యోతి ని ఎల్లారెడ్డిపేట ఇంచార్జ్ (ఎఫ్ఎసి) తహసిల్దార్ గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ ఉత్తర్వులు జారీ చేశారు కాగా ఆడేపు దివ్య జ్యోతి సోమవారం విధుల్లో చేరనున్నారు.

# రైతుల భూములను రైతులకే తిరిగి ఇవ్వాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే తక్షణమేస్పందించాలి**

ప్రజా వాయిస్ వేములవాడ/ సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామంలో రైతుల నుండి భూములను తీసుకునే ప్రయత్నాలను వెంటనే నిలిపివేసి భారతీయ జనతా పార్టీ వేములవాడ రూరల్ మండల శాఖ అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ డిమాండ్ చేశారు. 1970లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో మర్రిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 748లో ఉన్న సుమారు 200 ఎకరాల భూమిని పేద మధ్యతరగతి కుటుంబాలకు సాగు చేసుకునేందుకు కేటాయించారు అప్పటి నుండి ఆయా కుటుంబాలు తరతరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అయితే గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాల డైరీ ఏర్పాటు పేరుతో రైతుల నుండి ఈ భూములను తీసుకునే ప్రయత్నం జరిగినప్పుడు రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు ఆ సమయంలో రైతులకు మద్దతుగా నిలిచి పోరాటంలో పాల్గొన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అదే రైతుల భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని పరమేష్ విమర్శించారు. తరతరాలుగా ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న పేద మధ్యతరగతి రైతుల పొట్టకొట్టే విధంగా వ్యవహరించడం సరికాదని రైతుల భూములను బలవంతంగా తీసుకునే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే రైతులతో సమావేశమై వారి సమస్యలను స్వయంగా విని న్యాయం చేయాలని రైతులకు న్యాయం జరగని పక్షంలో రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ని పరమేష్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తోటా శేఖర్ ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు లక్కం తిరుపతి సాగర్ల నరేష్ మారం రాజేందర్ లింగంపల్లి రాజు సీనియర్ నాయకులు



చిట్టిపెల్లి రవి కిషోర్ ఆకుల బాబు గోపు రమేష్ సామోజు గౌతమ్ బిజెపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలను ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు తీగల తిరుమల గౌడ్



ప్రజా వాయిస్ దోమకొండ ఆగస్టు 30

దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో ఆదివారం రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడ పోటీలను ఆర్చరీ జిల్లా అధ్యక్షుడు తీగల తిరుమల గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ బోధన్ కామారెడ్డి నిజామాబాద్ అండర్ 20 సెలక్షన్స్ రాష్ట్రస్థాయి ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం కోచ్ ప్రతాప్ దాస్ మాట్లాడుతూ ప్రతి విభాగానికి 6 చొప్పున మూడు విభాగాలు ఉంటాయన్నారు. ఇండియన్ వార్, రికరువ్, కాంపౌండ్ లో భాగంగా క్రీడాకారులు 6 బాలికలు,6 బాలురు చొప్పున సెలక్షన్స్ ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు దేశస్థాయిలో నిర్వహించే క్రీడలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ లు రవీందర్, పీరియా నాయక్, పిన్నం రామచంద్రం, ముదాం శివ శంకర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది ఆర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## కల్లు కావడితో ఆకట్టుకున్న వరుణ్‌తేజ్



ప్రజా వాయిస్ అనంతగిరి

పాలవరం గ్రామంలో ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని రెడ్డిమళ్ల రాజా కుమారుడు వరుణ్‌తేజ్ కల్లు కావడితో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సంప్రదాయబద్ధంగా కల్లు కావడిని అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కల్లు కావడి కార్యక్రమంతో జాతరలో సందడి నెలకొంది.

## అమానవీయం.. అండగా ఉండాల్సిన సమాజంలో ఈ దారుణమా?

**మానసిక వైకల్యంతో ఉన్న మహిళపై అత్యాచారం.. కుటుంబానికి తీరని వేదన.**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. రూరల్ సీఐ పిఎన్డి.ప్రసాద్**

ప్రజా వాయిస్, నల్లగొండ:

మాటలు చెప్పలేని పరిస్థితి.. తనకు జరిగిన అన్యాయాన్ని పూర్తిగా వివరించుకోలేని నిస్సహాయత.. ఇలాంటి పరిస్థితిలో ఉన్న ఓ మానసిక వైకల్యంతో బాధపడుతున్న మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో కలకలం రేపింది. మానవత్వానికే మచ్చ తెచ్చే ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఓ గ్రామంలో మానసిక వైకల్యంతో ఉన్న మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు దారుణానికి పాల్పడ్డారు. ఆమె ప్రతిఘటించకుండా కాళ్లు, చేతులను బైండింగ్ వైర్‌తో కట్టేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలి అరుపులు విని కుటుంబ సభ్యులు/స్థానికులు ఘటనను గుర్తించినట్లు వెల్లడించారు. నిస్సహాయురాలిని లక్ష్యంగా చేసుకుని ఇంతటి దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి కుటుంబం, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.



## వికారాబాద్‌లో రెండు విషాద ఘటనలు

**- ఇంట్లో ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య**

**- మరో చోట బాలుడి ఆత్మహత్య..**

**- కారణాలపై పోలీసుల విచారణ**

ప్రజావాయిస్/వికారాబాద్:

వికారాబాద్ పట్టణంలో రెండు వేర్వేరు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. రాజీవ్ గృహకల్పకు చెందిన 20 ఏళ్ల ప్రీతి అనే యువతి 29వ తేదీ రాత్రి మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. యువతి ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తుండటంపై తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో అంబేద్కర్ నగర్ కాలనీ రామయ్యగూడకు చెందిన 17 ఏళ్ల కొండపల్లి సంజయ్ అనే బాలుడు నిన్న మధ్యాహ్నం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## 400 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

**బాల ప్రసాద్ మిత్రబృందం విద్యార్థులకు పలు సేవలు**




ప్రజా వాయిస్ దోమకొండ/

గత వారం రోజుల్లో దాదాపు 3 ప్రభుత్వ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు డిక్షనరీలను అందించగలిగామని దేవరగట్టు బాల ప్రసాద్ గత మిత్ర బృందం తెలిపింది. విద్యార్థులకు రోజుకు కనీసం 10 కొత్త ఇంగ్లీష్ పదాలు నేర్చుకుందామని చిన్న లక్ష్యం విధించామన్నారు మన గ్రామంలో, మన చుట్టుపక్కల ప్రాంతాల్లో చదువుకుంటున్న కొంతమంది విద్యార్థుల జీవితాల్లో అయినా వెలుగులు నింపే కృషి చేస్తున్నామన్నారు. పుస్తకాలు విద్యార్థుల జీవితాలను బాగుపరుస్తాయని వారితో వారి కుటుంబాలు ఉన్నత స్థితికి వస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యతలను పెంచుకోవాలని తమ మిత్రబృందం కృషి చేస్తుందన్నారు. చదువుతోపాటు నేర్పిన తప్పించడానికి నేటి విద్యార్థులు కృషి చేయాలన్నారు.

# కార్మిక హక్కుల కోసం పోరాడిన వ్యక్తి గ్యానం సారయ్య

**5వ వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, సూడి కృష్ణారెడ్డి**

**ప్రజావాయిస్ వెంకటాపురం :**
కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి గ్యానం సారయ్య అని,తన ఆశయం కోసం కార్మికులు, కర్షకులు, గిరిజన, గిరిజనేతర సమస్యల కోసం పోరాటాలు చేయడమే మనం సారయ్య కు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య కార్యకర్తల కు పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటాపురం మండల కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శ్రీను అధ్యక్షత న గ్యానం సారయ్య 5వ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ ..భద్రాచలం నియోజకవర్గం వెంకటాపురం మండలంలో సీపీఎం పార్టీ ఎదుగుదల కు దశాబ్దాలుగా



పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు.తన నివాస గృహమే ఓ పార్టీ కార్యాలయం అన్నారు.ఎక్కడ పేదల సమస్య వచ్చినా వారి హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సారయ్య అని గుర్తు చేశారు.పార్టీ కార్యకర్త గా చేరి సీపీఎం పార్టీలో అంచలంచలు గా ఎదుగుతూ పలు పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. పదవుల కోసం ఏనాడు పాటుపడని వ్యక్తి సారయ్య అన్నారు. భూమికోసం పేదలగూడు కోసం పలు పోరాటాలకు నాయకత్వం వహించిన సారయ్యకు ఇంటి స్థలం కూడా లేదని గుర్తు చేశారు. నిస్వార్థంకు నిలువెత్తు సాక్ష్యం సారయ్య అని అన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడమే గ్యానం సారయ్యకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ, నాయకులు తుమ్మల వెంకటరెడ్డి,మండల కార్యదర్శి గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు వంకా రాములు, చారి, కొప్పుల రఘుపతి, జజ్జరి దామోదర్ తదితరులు పాల్గొన్నారు



# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం...

**- మరపురాని జ్ఞాపకాలు**

**- 52 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1973-74 పదో తరగతి పూర్వ విద్యార్థులు**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : సుల్తానాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 1973--74 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సుల్తానాబాద్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యను అభ్యసించి 52 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ అపూర్వ కలయికలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై పూర్వ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం కొనసాగడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాసం, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం, పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. 52 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒకే వేదికపై కలుసుకోవడంతో కార్యక్రమం భావోద్వేగభరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, పలువురు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళ బడ్డీ కొట్టుకు ఎమ్మెల్యే అండ

**ఫిర్యాదు పేరుతో తొలగించిన దుకాణం..**
**తిరిగి అదే స్థలంలో ఏర్పాటు**
**కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదేశాలతో**
**కదిలిన మున్సిపల్ యంత్రాంగం**
**యాదవ సంఘం నాయకుల వినతి..**
**అధికారులపై ఎమ్మెల్యే ఆదేశాలు**

**ప్రజా వాయిస్,కోదాడ:**
కోదాడ పట్టణంలో బడ్డీ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న పేద మహిళ గడ్డం కనక మహాలక్ష్మికి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అండగా నిలిచారు. ఆమె నిర్వహిస్తున్న బడ్డీ కొట్టుపై పక్కనే ఉన్న షాపు యజమాని హనుమంతరావు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవల దానిని తొలగించారు.



దీంతో ఉపాధి కోల్పోయిన మహిళకు న్యాయం చేయాలని యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని ఈ నెల 28న కలిసి సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.బడ్డీ కొట్టు తొలగింపుతో పేద మహిళ జీవనోపాధి దెబ్బతిన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆమెకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. కమిషనర్ సెలవులో ఉన్నప్పటికీ ఆదివారం బడ్డీ కొట్టును తిరిగి ఏర్పాటు చేయడంతో మహిళ కుటుంబానికి ఊరట లభించింది.పేదల జీవనోపాధికి అండగా నిలవాలని, నిబంధనల పేరుతో వారి ఉపాధిని దెబ్బతీయకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించినట్లు నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించడంపై యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఈదుల కృష్ణ యాదవ్, కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, గుండెల సూర్యనారాయణ యాదవ్, పడేటి వెంకటేశ్వర్లు యాదవ్, మోడీ సైదిబాబు యాదవ్, భారీ ఎంకన్న యాదవ్, లిక్కి వెంకట యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హత కలిగిన పింఛన్దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఎంపీడీవో జలంధర్ రెడ్డి.

ప్రజా వాయిస్ /వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అర్హులైన పింఛన్దారులను ఈనెల అనగా ఆగస్టు 31 తేదీ వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీ జలంధర్ రెడ్డి తెలియజేశారు అర్హులైన వారు సంబంధిత అధికారులకు సంప్రదించి సంబంధిత డాక్యుమెంట్లు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు

# విశ్వశాంతి కోసం పాదయాత్ర చేపట్టడం అభినందనీయం

**19వ వీరశైవ లింగాయత్ సమాజం పాదయాత్ర ను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు ప్రజావాయిస్**
విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్చెరు నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం వరకు ప్రతి సంవత్సరం పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవాలయం వరకు చేపట్టిన 19వ మహా పాదయాత్రను ఆదివారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై..జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో



సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. 19 సంవత్సరాలుగా పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సపాన దేవ్, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నాగేష్, మార్కెట్



కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ఉపేందర్, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, వీరశైవ సమాజం ప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# వాసలమర్రిలో రంగరంగ వైభవంగా పలుగుల మైసమ్మ తల్లి జాతర

**ప్రజావాయిస్/తుర్కపల్లి**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసలమర్రి గ్రామంలో పలుగుల మైసమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో రంగరంగ వైభవంగా నిర్వహించారు.సుమారు 200 సంవత్సరాల పైగా చరిత్ర కలిగిన మైసమ్మ తల్లి ఆలయంలో తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ప్రతి ఏడాది జాతరను ఘనంగా నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందడం గ్రామ ప్రజల ఆనవాయితీగా వస్తోంది.జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, యువకులు, సహకరించారు.

# రీల్స్‌లో 'హీరో' - రియాలిటీలో 'జీరో'.!

**అధికారులను నిలదీయని ప్రధాన ప్రతిపక్షం**
**ఫోటో షూట్లకే పరిమితమైన బీఆర్ఎస్ నేత**
**అధ్యక్ష పదవి నుంచి రావులకోళ్ల నాగరాజ్‌ను**
**తక్షణమే తప్పిస్తేనే పార్టీ మనుగడని**
**పార్టీ కార్యకర్తల అంతర్గ చర్చలు**

**ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:**
బండ్లగూడ జాగీర్ పరిధిలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తీరు'స్ర్కీన్ ముందు హీరో - స్పాట్‌లో జీరో'అన్నట్లుగా తయారైందనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జాగిర్ లోని మూడు డివిజన్లలో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా, సమస్యలపై అధికారులను నిలదీసి పరిష్కరించాల్సిన ప్రతిపక్ష నేతలు కేవలం 'సోషల్ మీడియా హంగామా'కే పరిమితమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా మూడు డివిజన్ల బాధ్యతలు మోస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ నాయకత్వ వైఫల్యంపై,ఆయన అసమర్థతపై పార్టీ కార్యకర్తలు,ప్రజలు,తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.



బండ్లగూడ జాగిర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్

**అధిష్టానం మెప్పు కోసమే డ్రామాలు...!**
ఇరుకైన రోడ్లు,విస్తరణకు నోచుకోకపోవడం,తాగునీటి ఎద్దడి,అడుగడుగునా గోతులు పడిన రోడ్లు, ఉప్పొంగే డ్రెయినేజీలు, వెలగని వీధి దీపాలు,నిత్యం విసిగించే ట్రాఫిక్ సమస్యలతో జనం చస్తుంటే,బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఇవేవీ పట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజా సమస్యలపై నిరసన తెలుపాలని,ధర్నాలు చేపట్టాలని,పార్టీ అధిష్టానం పిలుపునిస్తే చాలు,సొంత ప్రచారం కోసం జనాన్ని సమీకరించి కెమెరాలకు ఫోజులివ్వడం తప్ప,స్థానిక మున్సిపల్ అధికారులను కలసి సమస్యల పరిష్కారానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం గమనార్హం. కేవలం అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయడానికే ఈ 'జన సమీకరణ డ్రామాలు'ఆడుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లోనూ గట్టిగా జరుగుతోంది.

**నాగరాజ్ 'ఫోటో షూట్'ల రాజకీయం - ఆ పదవికి ఆయన అనర్హుడు!**
డివిజన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ కేవలం కుర్చీకే పరిమితమై, ఏసీ గదుల్లో కూర్చుని సోషల్ మీడియాలో రీల్స్, పోస్టులు వేస్తూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.ప్రజాక్షేత్రంలో ఉండి పోరాడాల్సిన నాయకుడు'పబ్లిసిటీ పిచ్చి'తో ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. ప్రతిపక్షంగా అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైన నాగరాజ్‌ను,ఆ డివిజన్ అధ్యక్ష పదవి నుంచి వెంటనే తప్పించాలని జాగీర్ పార్టీ నేతలు కార్యకర్తలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రజా సమస్యలపై పోరాడే దమ్మున్న నాయకుడికి మాత్రమే ఆ బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేస్తున్నారు.

**రోడ్డెక్కి పోరాడకపోతే గుణపాఠం తప్పదు!**
ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తమ ఫోటో షూట్ రాజకీయాన్ని పక్కనబెట్టి క్షేత్రస్థాయిలోకి రావాలని జాగీర్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.సోషల్ మీడియా లైక్‌లు,కామెంట్లు ప్రజా సమస్యలను తీర్చవని,ప్రత్యక్షంగా రోడ్డెక్కి అధికారులను నిలదీస్తేనే పనులు జరుగుతాయని హితవు పలుకుతున్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకుని ప్రజల పక్షాన పోరాటానికి దిగకపోతే,రాబోయే రోజుల్లో జాగీర్ ప్రజలే బీఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిస్తున్నారు.



## ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహణ

**ప్రజా వాయిస్, చింతలపాలెం, ఆగష్టు 30**

చింతలపాలెం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం లో శ్రీ కళ్యాణి డెంటల్ క్లినిక్, కోదాడ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రజలకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, వైద్యుల సలహాలు అందించారు. ఈ శిబిరాన్ని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు వంగవీటి అంబరీష్, 2వ వార్డు సభ్యులు చింతిరాల సురేందర్, నాయకులు మల్‌రెడ్డి కృష్ణారెడ్డి, దొంగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

### బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగష్టు 30**

గంగమ్మ తల్లి ఆశీస్సులతో హుజూర్‌నగర్ నియోజక వర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ఆకాంక్షించారు. ఆదివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిస్తున్న శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారి మహోత్సవంలో పిల్లుట్ల రఘు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గంగమ్మ తల్లి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, ఆలయ నిర్వాహకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దామెరలో తొలిసారిగా రైతు మార్కెట్ ప్రారంభం

### మన పంట-మన గ్రామం-మనకు మనమే మార్కెట్



**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**

గ్రామీణ రైతులకు తమ పంటలకు స్థానికంగానే మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన రైతు మార్కెట్ (కూరగాయల మార్కెట్) ను గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ బిజెపి ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకుల చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఈ రైతు మార్కెట్ ద్వారా దామెర గ్రామంలో కూర గాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను దూరప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. మన పంట–మన గ్రామం–అనే ఆలోచనతో ప్రారంభించిన ఈ మార్కెట్ రైతు వినియోగదారుల మధ్య నేర సంబంధాన్ని పెంపొందించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి రైతులకు మెరుగైన ధర అందేలా దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతులు తమ పంటలను స్వయంగా విక్రయించుకోవడం ద్వారా రవాణా ఖర్చులు సమయం ఆదా అవుతాయని మరోవైపు గ్రామ ప్రజలకు ఖాజా కూరగాయలు నేరుగా రైతుల వద్ద నుంచే లభిస్తాయని తెలిపారు. దామెరలో పండించిన కూరగాయలకు దామెరలోనే మార్కెట్ కల్పించడం ద్వారా స్థానిక రైతులకు ప్రోత్సాహం లభించడంతో పాటు గ్రామ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా దామెర గ్రామ సర్పంచ్ మంకాని పద్మ చేరాలు, ఉప సర్పంచ్ మద్దె కుమార్, బిజెపి ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మస్తుర్తి శ్రీకాంత్ యాదవ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కలిసి రైతు మార్కెట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు స్థానికులు తదితరులు పాల్గొని రైతు మార్కెట్ ఏర్పాటును స్వాగతించారు. భవిష్యత్తులో రైతు మార్కెట్ ను మరింత విస్తరించి ఎక్కువ మంది స్థానిక రైతులు కూరగాయల సాగుదారులు చిన్న వ్యాపారులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

## జైనూర్‌లో పులాజీ బాబా 102వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో ఆదివారం పులాజీ బాబా 102వ జన్మదిన వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గొడం నగేష్, ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి, ఖానాపూర్ శాసనసభ్యుడు వెద్మ బొజ్జు పటేల్ పులాజీ బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిద్ధేశ్వర సంస్థాన్ కమిటీ విజ్ఞప్తి మేరకు బాబా మందిర నిర్మాణానికి ఎంపీ కోటా నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసేందుకు గొడం నగేష్ కృషి చేస్తానని ప్రకటించారు. ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ అధికారి మంద మకరందు, ఇరువురు శాసనసభ్యులు సైతం ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. కమిటీ అధ్యక్షులు ఇంగ్లే కేశవ్ దాదా, కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించిన వినతి పత్రాలు అందజేశారు. అనంతరం పులాజీ బాబా ఆధ్యాత్మిక సందేశాలు, పాటలతో కూడిన పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్...

### - రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మాణం.



ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పన్నాల రాములు, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**మోటకొండూరు, ఆగస్టు 30(ప్రజా వాయిస్):-.**



మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పైళ్ల అరుణ, వెంకటరెడ్డి దంపతుల కుమారుడు రాజశేఖర్ రెడ్డి వివాహ వేడుక ఆదివారం భువనగిరి పట్టణంలోని శ్రీ సాయి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవంలో నాంచారిపేట పాల సంఘం చైర్మన్ పైళ్ల సుదర్శన్ రెడ్డి, 6వ వార్డు సభ్యుడు పైళ్ల మహేష్ రెడ్డి,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

### రాష్ట్ర నాయకులు చెట్టుపెల్లి లక్ష్మణ్

**ప్రజా వాయిస్, కథలాపూర్:**

ఎస్సీ వర్గీకరణ సాధించినంత మాత్రాన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగదని, ఇకపై అణగారిన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పోరాడతామని ఆ సంఘం రాష్ట్ర నాయకులు చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండల కేంద్రంలో జిల్లా మాజీ అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం అధ్యక్షతన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా మారంపల్లి వినోద్ మాదిగ, అధికార ప్రతినిధిగా పొడిటి అర్జున్, ప్రధాన కార్యదర్శులుగా నక్క శంకర్, కొత్తూరు నవీన్, ఉపాధ్యక్షులుగా తరి పృథ్వీరాజ్, ఆయిల్ వార్ కిరణ్, ఎర్ర అంజయ్యలు ఎన్నికయ్యారు. కోశాధికారిగా తుర్తి దేవేందర్, కార్యదర్శులుగా గజ్జల అశోక్, లింగంపల్లి నరసయ్య, పానుగంటి అజయ్, బోయిని జలపతి, సహాయ కార్యదర్శులుగా రాగుట్ల తిరుపతి, బొడ్డు గణేష్, బాపురపు నరేష్‌లను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా సుంకే శ్రీకాంత్, చౌలమద్ది శంకర్, తెడ్డు గంగారెడ్డి, నల్ల నరేందర్, దయ్యాల నారాయణ, సింగారపు గంగారెడ్డి, దయ్యాల నరేష్, రాగుట్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా హాస్టల్‌కు వెట్ గ్రైండర్ మిషన్ విరాళం

### మహాత్మ హెల్పింగ్ వ్యవస్థాపకులు గంటా రవీందర్

**ప్రజా వాయిస్/పాలకుర్తి**

**(ఆగస్టు 30 )**



జనగామ జిల్లా, పాలకుర్తి:పాలకుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థుల సౌకర్యార్థం వెట్ గ్రైండర్ మిషన్‌ను విరాళంగా అందించారు. మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంటా రవిందర్ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ వెట్ గ్రైండర్ మిషన్‌ను డొనేట్ చేశారు. జిల్లాలో మొత్తం 12 మండలాలు ఉండగా, 11 కస్తూర్బా హాస్టళ్లకు వెట్ గ్రైండర్ మిషన్లను అందించినట్లు గంటా రవిందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సౌకర్యం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలు

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లోని జానకపూర్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న పిలుపునిచ్చారు. భారత పాలకవర్గాల రైతు వ్యతిరేక విధానాలు, సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఢిల్లీ రైతాంగ పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదు. 32 దేశాలతో, ముఖ్యంగా అమెరికాతో కుదుర్చుకున్న అసమాన ఒప్పందాల వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, మద్దతు ధర రావట్లేదు. ఈ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలి. బహుళజాతి కంపెనీల నకిలీ విత్తనాల వ్యాపారంపై ప్రభుత్వాలు నియంత్రణ విధించాలి. మంచిర్యాలలో జరిగే మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించి బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మిస్తారు. జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు.







# ముత్తిరెడ్డిగూడెంలో ఘనంగా బీరప్ప, అక్క మహంకాళి బోనాలు

**మోటకొండూరు,ఆగష్టు 30( ప్రజా వాయిస్):-**
మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్ప, అక్క మహంకాళి బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో తలపై బోనాలు ఎత్తుకుని, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో గ్రామ యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పాడిపంటలు చల్లగా ఉండి, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవుళ్లను ప్రార్థించారు. ఈ భక్తిపూర్వక కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు, యువజన సంఘాల నాయకులు, మహిళలు, భక్తులు మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అందరి సహకారంతో ఈ బోనాల పండుగ విజయవంతమైందని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.



# నిషేధిత జాబితా నుండి తొలగించాలి

**ప్రజా వాయిస్,మోత్కూరు,(ఆగస్టు30)**
మోత్కూరు మండలంలో22-A నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను వెంటనే పరిశీలించి, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని బీజేపీ మోత్కూరు మండల పార్టీ అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పనకబండ గ్రామంలో రైతుల సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటూ, హక్కు పత్రాలతో అనుభవిస్తున్న భూములు 22–ఏ జాబితాలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతు తన భూమిని అమ్ముకోలేడనీ,అవసరానికి తాకట్టు పెట్టుకోలేడని,,కుటుంబంలో ఆర్థిక అవసరాల తీర్చలేడని, వ్యవసాయ అవసరాలకు ఆర్థిక సహాయం పొందలేన్నారు. అలాంటప్పుడు ఆ భూమిపై రైతుకు ఉన్న హక్కు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.భూమి ప్రభుత్వానిది కాకపోతే 22–ఏ నిషేధిత జాబితాలో ఎందుకు ఉంచుతున్నారు? అర్హత ఉన్న భూములను గుర్తించి నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి ప్రభుత్వం ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. రైతుల కన్నీళ్లు, వారి కుటుంబ అవసరాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీశారు.రైతుల భూముల సమస్యను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా

# వివాహ వేడుకలో పాల్గొన్న జంగా రాఘవ రెడ్డి



**ప్రజావాయిస్ / పాలకుర్తి**
పాలకుర్తి నియోజకవర్గం మల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,మండల పార్టీ అధ్యక్షులు కుమార్తె వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన వధూవరులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వైవాహిక జీవితం ప్రేమ, అనురాగం,ఆనందం, సుఖసంతోషాలతో నిండాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కలిసి జీవించాలని ఆకాంక్షించారు.వారి దాంపత్య జీవితం సిరిసంపదలతో, సంతోషాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరెన్నో శుభకార్యాలతో కుటుంబం ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ ఆత్మీయ వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.నూతన వధూవరులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు మీ దాంపత్య జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షిస్తున్నాం.



# పరిశుభ్రతతోనే డెంగ్యూకు అడ్డుకట్ట

## సామాజిక ఆరోగ్య అధికారి టి. వేణుగోపాల్

**ప్రజా వాయిస్, కథలాపూర్:**
మండలంలోని తక్కెళ్ళపల్లి గ్రామంలో మంగళవారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బి. రాజ గంగారాం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సామాజిక ఆరోగ్య అధికారి టి. వేణుగోపాల్ పాల్గొని ప్రసంగించారు. ప్రతి మంగళ, శుక్రవారాలను 'పొడి దినం' (డ్రై డే)గా పాటించి, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పాత్రల్లో నీరు చేరితే దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. జ్వరం వస్తే వెంటనే కథలాపూర్ లేదా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని సూచించారు. డెంగ్యూ నిర్ధారణకు 'ఎలీసా' పరీక్ష కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలో జ్వరసర్వే నిర్వహించి, ముగ్గురు బాధితులకు ప్రాథమిక చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఉప విభాగ అధికారి బేగ్, ఆరోగ్య కార్యకర్త రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్**
మంచిర్యాల జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జిల్లా స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేష్, మంచిర్యాల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్, పిటి జగతి ఆదిత్ కుమార్, సీనియర్ క్రీడాకారులు జీషాన్, అంజి, అలాగే ఎస్సై రాజశేఖర్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ మాట్లాడుతూ, గత సంవత్సరం కూడా తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మంచి మానసిక స్థితి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు జట్టు భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు సీనియర్ క్రీడాకారులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గ్రామ ప్రజలకు ఇబ్బందిగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ పనులు ఆపాలి...

## విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు..

**ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట)**
వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ప్రజలు నివసించే ఇంట్ల స్థలాలపై నుండి 11 కేవీ విద్యుత్ లైన్ పనులను కొనసాగిస్తున్నారు.. పాలకేంద్రం నుండి గాంధీ కాలనీ మీదుగా ఇండ్ల మధ్య నుండి వెళ్తున్న ప్రమాదకర 11 కేవీ లైన్లను ఆపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ లైన్ పనులను వెంటనే నిలిపివేసి ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని వర్ధన్నపేట ఏ.ఈ తరుణ్ కి వినతిపత్రం అందజేసారు గ్రామ ప్రజలు.. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బాషబోయిన ప్రవీణ్,చీపురు వెంకటస్వామి, మరియు ఎలిశాల రాజేష్,పోశాల సురేష్,మునుకుంట్ల సూరయ్య, మునుకుంట్ల భిక్షపతి,తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ హెచ్ 44 జాతీయ రహదారిపై కారులో చెలరేగిన మంటలు

## కారు పూర్తిగా దగ్ధం

**ఆగస్టు 30 (ప్రజా వాయిస్) చేగుంట**
చేగుంట పట్టణ పరిధిలోని 44 జాతీయ రహదారిపై కారులో మంటలు చెలరేగాయి,పోలీస్ వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా,బిక్నూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న , టీ ఎస్ 11యు 5137 గల కారు, రెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద, రాగానే, కారు నుండి ఒకసారిగా మంటలు వ్యాపించాయి, మంటలను గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే వాహనాన్ని పక్కకు నిలిపి వేయడంతో పాటు, కారులో ఉన్న ప్రయాణికులను బయటకు దింపారు, దీంతో పెను ప్రమాదం తప్పింది అయితే మంటలు భారీగా వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది,ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పడంతో అంతా ఊపిరిపీంచుకున్నారు ,





# పేద విద్యార్థుల భవిష్యత్తుకు స్వేరో సర్కిల్ కొండంత అండ

## మైలారం జగన్ స్వారో సర్కిల్ ఇన్‌చార్జి

## తాళ్ళపల్లి గ్రామంలో అంబెడ్కర్ విజ్ఞాన మందిరం కమిటీ ఏర్పాటు

**(ప్రజా వాయిస్ షాబాద్)**
షాబాద్ మండలం తాళ్ళపల్లి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబెడ్కర్ అడుగుజాడల్లో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆలోచనా విధానానికి అనుగుణంగా బడి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో స్వేరో సర్కిల్ అంబెడ్కర్ విజ్ఞాన మందిరం నూతన కమిటీని తాళ్ళపల్లి స్వేరో సర్కిల్ ఇంచార్జ్ మైలారం జగన్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పేద మరియు ఎదిగే బడి పిల్లలు చదువులో ముందుండడానికి సన్మార్గంలో నడవడానికి ట్యూషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు అయితే ప్రస్తుత సమాజంలో ట్యూషన్ చదువులు ఎంతో ఖర్చుతో కూడుకున్నవని అలాంటి క్లిష్ట సమయంలో నిరుపేద పిల్లలకు ఉచితంగా విద్యను అందించాలనే ఉద్దేశంతో ఆవిర్భవించిన స్వేరో సర్కిల్ వ్యవస్థ ఎంతో గొప్పదని కొనియాడారు ఈ మహత్తర కార్యక్రమానికి తాము ఎల్లవేళలా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు ఈ సమావేశంలో షాబాద్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అక్కమొళ్ళ జంగయ్య, తాళ్ళపల్లి గ్రామ ఉప సర్పంచ్ అంజయ్య, నాయకులు అప్పలి నిరంజన్, ఆశిగారి బాల్ రాజ్, జి. వెంకటేష్, ఎస్. రాజేష్, విక్రమ్, సాయి, పవన్, సందీప్, సందీప్, ఆనంద్ రాజ్, ధనుంజయ, అంజయ్య, అంజయ్య, కిష్టయ్య, గోపిచంద్, కిషోర్, మహేష్లతో పాటు గ్రామస్థులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధర లేక దున్నేశాడు.. రైతు కన్నీటి కష్టం

*- కిలోల కొద్ది పంట..బాక్స్ రూ.80*

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**
వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని సయ్యద్ అలీపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి, తండ్రి రామిరెడ్డి ఒక ఎకరం పొలంలో టమాటా సాగు చేశారు. పంట చేతికొచ్చినప్పటికీ మార్కెట్‌లో టమాటా బాక్స్‌కు కేవలం రూ.80 ధర పలకడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ ధరకు పంటను మార్కెట్‌కు తరలిస్తే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక చివరకు ఎకరం పొలంలోని టమాటా పంట మొత్తాన్ని దున్నేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వెంకట్‌రెడ్డి కోరారు.

